Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 88 మేడ్చల్ మల్కాజ్‌గిరి 20 ఏప్రిల్ 2023 గురువారం పేజీలు : 4

## మాఫియాకు చోటులేదు

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మాఫియాకు ఇక చోటు లేదని, క్రిమినల్స్ ఆగడాలు అసలే ఉండబోవని సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. గ్యాంగ్‌స్టర్ అతీఖ్ అహ్మద్ హత్య నేపథ్యంలో యోగి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. లఖ్‌నవు, హర్దోయి జిల్లాల్లో టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటుపై అవగాహన ఒప్పంద కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో యోగి మాట్లాడుతూ.. "మాఫియా సహా ప్రొఫెషనల్ క్రిమినల్స్ నుంచి పారిశ్రామిక వేత్తలకు ఇప్పుడు ఎలాంటి బెదిరింపు ఫోన్లు రావు. పారిశ్రామిక వేత్తలు ప్రశాంతంగా వారి పనిచేసుకోవచ్చు" అని వ్యాఖ్యానించారు.

# త్రిముఖ పోరు!

## రంజుగా తెలంగాణ రాజకీయం



## అధికారాన్ని నిలబెట్టుకోవాలని టీఆర్ఎస్ ఆరాటం

## కేసీఆర్‌కు పోటీగా పుంజుకోవాలని కాంగ్రెస్, బిజెపి పోరాటం

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. అధికార టీఆర్ఎస్కు పోటీగా బీజేపీ కాంగ్రెస్ పుంజుకోవడంపై దృష్టి సారించాయి. దీంతో త్రిముఖ పోటీ తప్పేలా లేదు. కానీ జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పరిణామాల నేపథ్యంలో తెలంగాణ రాజకీయాలు మారే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కాంగ్రెస్లో చేరితే అప్పుడు రాష్ట్ర రాజకీయాలు మరిన్ని మలుపులు తిరగడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ హైకమాండ్తో ప్రశాంత్ కిషోర్ సమావేశమయ్యారు.

ఆ పార్టీ తిరిగి పుంజుకోవడం కోసం సూచనలు చేశారు. మరోవైపు ఆయన త్వరలోనే హస్తం గూటికి చేరే అవకాశం ఉందని మరోసారి ప్రచారం జోరందుకుంది. కాంగ్రెస్ టీఆర్ఎస్ పొత్తు..ప్రస్తుతం తెలంగాణలో అధికార టీఆర్ఎస్ కోసం పీకే టీమ్ పనిచేస్తోంది. కేసీఆర్ను మూడోసారి సీఎం చేసేందుకు పీకే వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. కానీ ఇప్పుడు ఆయన కాంగ్రెస్లో చేరితే కేసీఆర్ కోసం పని చేయరు. అప్పుడు ఆయన సలహాలు కాంగ్రెస్ అధిష్ఠానం పాటిస్తుంది. ఈ నేపథ్యంలో బీజేపీపై పగతో ఉన్న పీకే.. తెలంగాణలో ఆ పార్టీ పుంజుకోకుండా అడ్డుకునే అవకాశం ఉంది. అందుకు టీఆర్ఎస్ కాంగ్రెస్ పొత్తు తెరపైకి తెచ్చే వీలుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అందుకు కోమటిరెడ్డి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీహెచ్ లాంటి సీనియర్లు ఒకే చెప్పే అవకాశం ఉంది. ఎందుకంటే వీళ్లకు రేవంత్ రెడ్డి సీఎం కావొద్దు అని ఉందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. రేవంత్ కష్టం వృథా..ఒకవేళ పీకే సూచన మేరకు తెలంగాణలో కాంగ్రెస్ టీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటే అప్పుడు టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి కష్టం మొత్తం వృథా అయినట్లే. పొత్తులో భాగంగా మళ్లీ సీఎం కేసీఆర్ కావడం ఖాయమనే అభిప్రాయాలున్నాయి. ఒకవేళ కాంగ్రెస్ పార్టీకి మంచి ఫలితాలు వచ్చినా రేవంత్ సీఎం అయ్యే అవకాశమే ఉండదు. ఒకవేళ ఈ రెండు పార్టీల పొత్తు నేపథ్యంలో ఎన్నికల నాటికి రేవంత్కు బీజేపీ నుంచి పిలుపు వస్తే ఆయన ఏం చేస్తారు అనేది కూడా ఆసక్తికరంగా మారింది. మరోవైపు బీజేపీ జోరుకు బ్రేక్ వేసేందుకు పీకే ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలో ఆయన టీమ్ సేకరించిన సమాచారం ప్రకారం బీజేపీ హిందుత్వాన్ని బలంగా ప్రచారం చేసే అవకాశం ఉంది. ఆ పార్టీని పరోక్షంగా ఎంఐఎం బీ టీమ్గా పని చేస్తుందని పీకే అనుకుంటున్నారని టాక్. అలా అయితే కాంగ్రెస్కే దెబ్బ పడుతుంది కాబట్టి టీఆర్ఎస్తో పొత్తు ఉండదని రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ చెబుతున్నారు. కానీ ఎన్నికల నాటికి పరిస్థితి ఎలా మారుతుందో చెప్పలేమని విశ్లేషకులు అంటున్నారు. ఇక కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్రెడ్డి పార్టీలోనే కొనసాగుతా నని కచ్చితంగా చెప్పడం లేదు. టీఆర్ఎస్పై పోరాడే పార్టీలోకి వెళ్తానని ఆయన గతంలో స్పష్టం చేశారు. ఒకవేళ ఎన్నికల్లో కాంగ్రెస్ టీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటే ఆయన కచ్చితంగా బీజేపీలో చేరే అవకాశం ఉంది. మరి ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో చూడాలి.

## ఎన్నికల ముంగిట పడిపోతున్న బీజేపీ గ్రాఫ్!

కర్ణాటక ఎన్నికల ముంగిట అధికార బీజేపీకి గ్రాఫ్ ఢమాల్ మంటోంది. కీలక నాయకులు ఇప్పటి వరకు 60 మంది వరకు పార్టీకి రాంరాం చెప్పారు. పోనీ.. పోతేపోనీలే అనుకునే బ్యాచ్ కాదు. అందరూ కూడా ఉద్ధండులు.. వారు గెలవడమే కాకుండా..వఆరి వర్గాన్ని కూడా గెలిపించుకునే లక్ష్యంతో ఉన్నవారు. గత ఎన్ని కల్లో వీరి అండతోనే కర్ణాటకలో బీజేపీ పాగా వేసింది. అయితే.. ఇప్పుడు వీరికి టికెట్లు ఇవ్వకుండా చేయ డంతో పార్టీ ఖాళీ అవుతున్న పరిస్థితి నెలకొంది. ఇదిలావుంటే మాజీ ముఖ్యమంత్రి బీజేపీని రాష్ట్రంలో డెవలప్ చేసిన నేత జగదీశ్ శెట్టర్ కూడా కమలం గూటికి గుడ్ బై చెప్పారు. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. రాజీనామా చేసిన కనీసం 24 గంటలు కూడా కాకుండానే ఆయన కాంగ్రెస్లో చేరారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో జగదీశ్ శెట్టర్ కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. కేపీసీసీ చీఫ్ డీకే శివకుమార్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యల వ్యూహం ఫలించడం విశేషం. నిజానికి కర్ణాటకలో బీజేపీని బలపరిచేందుకు పార్టీ కార్యకర్త స్థాయి నుంచి కూడా శెట్టర్ నిరంతరం శ్రమిం చారు. సంఘ్ పరివార్ నుంచి బీజేపీ వరకు ఏకంగా 32 సంవత్సరాల పాటు.. పయనించారు. మధ్యలో సీ ఎం అయ్యారు. అదే విధంగా రాష్ట్ర బీజేపీకి సారథ్యం వహించారు. ఇవన్నీ ఇలా ఉంటే లింగాయత్ వర్గాని కి చెందిన బలమైన నాయకుడిగా శెట్టర్కు పేరుంది. అలాంటి నాయకుడికి కేంద్ర బీజేపీ



నేతలు టికెట్ ఇవ్వకపోవడంతో బీజేపీ పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలోకి పడినట్లు అయిందనే వాదన వినిపిస్తోంది. 'ఆదివారమే బీజేపీ పార్టీకి రాజీనామా చేశా. సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరా. ప్రతిపక్ష నేత మాజీ ముఖ్య మంత్రి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన తాను కాంగ్రెస్ చేరడం కొందరికి ఆశ్చర్యం కలిగిస్తోంది. బీజేపీ నాకు ప్రతి పదవి ఇచ్చింది. పార్టీ కార్యకర్తగా బీజేపీ ఎదుగులదలకు నిరంతరం శ్రమించా' అని జగదీశ్ శెట్టర్ చెప్పారు. ఏదేమైనా ప్రస్తుత పరిణామాలను గమనిస్తే.. కర్ణాటకలో ఆ పార్టీ ఓటమికి సంకేతాలుగానే భావించవచ్చని అంటున్నారు పరిశీలకులు.

## పొంగులేటికి ఇంత డిమాండ్ ఉందా ?



ఖమ్మం : మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసులరెడ్డికి డిమాండ్ బాగా పెరిగిపోతున్నట్లుంది. పొంగులేటిని పార్టీలో చేర్చుకోవాలని ఇటు కాంగ్రెస్ అటు బీజేపీలు బాగా ప్రయత్నాలు చేస్తున్నాయి. మాజీ ఎంపీ మాత్రం ఎవరికీ ఎలాంటి హామీలు ఇవ్వకుండా చాపకింద నీరులాగ వ్యవహారాలను నడుపుతున్నారు. అయితే తొందరలోనే ఏదో ఒక నిర్ణయం తీసుకోక పొంగులేటికి తప్పదు. ఎందుకంటే ఎన్నికలు దగ్గరకు వచ్చేస్తున్నాయి. షెడ్యూల్ ఎన్నికలు డిసెంబర్లో జరుగుతాయంటే ఇక ఉన్నది కేవలం ఏడు మాసాలు మాత్రమే. అందుకనే పార్టీలు కూడా పొంగులేటిపై బాగా ఒత్తిడి తెస్తున్నాయి. ఈమధ్యనే పొంగులేటిని కాంగ్రెస్ లో చేర్చుకునే ఉద్దేశ్యంతో రాహుల్ గాంధీ టీమ్ ప్రత్యేకంగా సమావేశమైనట్లు ప్రచారం పెరిగిపోతోంది. అయితే రెండువర్గాల్లో ఏది కూడా దీన్ని కన్ఫర్మ్ చేయలేదు. రాహుల్ టీమ్ తో సమావేశమైనపుడు తన మద్దతుదారులకు 10 టికెట్లివ్వాలని పొంగులేటి షరతు విధించినట్లుగా ప్రచారంలో ఉంది. దీనిపై మాజీ ఎంపీ రేణుకా చౌదరి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చాలా అసంతృప్తిగా ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఇక్కడ గమనించాల్సిందేమంటే పొంగులేటి అడిగారని ప్రచారం జరుగుతున్నట్లు 10 సీట్లు ఇవ్వటం సాధ్యం కాకపోవచ్చు.

అయితే ఎన్నో కొన్ని అయితే ఇవ్వడానికి రెడీ అయితే కాంగ్రెస్ కే మంచిది. ఎందుకంటే ఖమ్మం రాజకీయాల్లో పొంగులేటికి బలమైన వర్గముంది. పైగా ఆర్థికంగా అత్యంత పటిష్టమైన స్థితిలో ఉన్నారు. ఇదే సమయంలో రేణుకది కేవలం బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలు మాత్రమే అనే ప్రచారం ఉండనే ఉంది. పొంగులేటికి ఎంపీ టికెట్ ఇచ్చి కొందరికి ఎంఎల్ఏ టికెట్లిస్తే పార్టీకే మంచిది. జిల్లావ్యాప్తంగా బలమైన అనుచరులున్న పొంగులేటి జిల్లా వ్యాప్తంగా అభ్యర్థుల గెలుపులో కీలకపాత్ర పోషిస్తారనటంలో సందేహంలేదు. అంతేకాకుండా ఆర్థిక వనరుల సర్దుబాటు కూడా పొంగులేటికి చాలా ఈజీ. జిల్లాలోనే కాకుండా ఇతరత్రా సర్దుబాటుకు కూడా పొంగులేటి వెనకాడరు. కాబట్టి ఏరకంగా చూసుకున్నా రేణుక భట్టి అసంతృప్తులను పక్కనపెట్టేసి పొంగులేటిని పార్టీలో చేర్చుకోవటమే శ్రేయస్కరం. ఇదే సమయంలో పొంగులేటి కొత్తపార్టీ పెడతారనే ప్రచారం కూడా ఉంది. ఇదే జరిగితే పొంగులేటి తనను తాను చాలా ఎక్కువగా అంచనా వేసుకున్నట్లే లెక్క. చివరకు ఏమి జరుగుతుందో చూడాల్సిందే.

## ట్రబుల్ షూటర్ సారధ్యంలో...

# కర్ణాటక ప్రచారానికి బిఆర్ఎస్ బృందం!!



హైదరాబాద్ : తొందరలో జరగబోయే కర్నాటక ఎన్నికల్లో బీఆర్ఎస్ బృందం ప్రచారం చేయబోతోంది. ఈ బృందానికి మంత్రి హరీష్ రావు నాయకత్వం వహించబోతున్నారు. స్టార్ క్యాంపెయినర్ గా సినీనటుడు ప్రకాష్ రాజ్ కూడా పర్యటనలో కీలకంగా వ్యవహరించబోతున్నారు. బీఆర్ఎస్ కు కర్నాటకలోని జేడీఎస్ మిత్రపక్షంగా ఉన్న సంగతి తెలిసిందే. జేడీఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి నాయకత్వంలో పార్టీ అన్ని స్థానాలకు పోటీ చేస్తుంది. కాబట్టి జేడీఎస్ కు మద్దతుగా బీఆర్ఎస్ తరపున ప్రచారం చేయాలని కేసీయార్ డిసైడ్ అయ్యారు. ఎందుకంటే కర్నాటక-తెలంగాణా సరిహద్దు జిల్లాలు బీదర్ గుల్బర్గా హమ్నాబాద్ రాయచూర్ యాద్గిరి ఉన్నాయి. ఈ జిల్లాల్లో ఎక్కువగా తెలుగు ప్రజలుంటారు. అనేక అవసరాల కోసం ప్రతిరోజు రెండు రాష్ట్రాల మధ్య జనాలు రాకపోకలు సాగిస్తుంటారు. అందుకనే పై జిల్లాల్లో హరీష్ నాయకత్వంలో మంత్రులు ఎంఎల్ఏలు ఎంపీలు సుమారు 30 మంది ప్రచారం చేయటానికి రెడీ అవుతున్నారు. వీళ్ళకి అదనంగా సినీనటుడు ప్రకాష్ రాజ్ స్పెషల్ అట్రాక్షన్ గా ఉండబోతున్నారు. ప్రకాష్ రాజ్ కు కన్నడ భాషపై మంచిపట్టుంది. కన్నడ రాజకీయాలను ఈ నటుడు చాలా యాక్టివ్ గా ఫాలో అవుతుంటారు. కాబట్టి ప్రచారంలో ప్రకాష్ రాజ్ కీలకపాత్ర పోషించబోతున్నారట. ప్రచారానికి సంబంధించిన రూట్ మ్యాప్ ఇప్పటికే జేడీఎస్ కేసీయార్ కు అందించినట్లు సమాచారం. ఈనెల మూడోవారంలో మొదటి విడత ప్రచారం మొదలవ్వబోతోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే మే 10వ తేదీన పోలింగ్ జరగబోతోంది. అంటే ప్రచారానికి పట్టుమని 20 రోజులు మాత్రమే అవకాశముంది. రోజుకు రెండు నియోజకవర్గాల్లో ప్రచారం చేసినా ఉన్న సమయం సరిపోదు. అందుకనే వీలైనంత తొందరలో ప్రచారానికి దిగాలని ఇప్పటికే కేసీయార్ ఆదేశించారట. మొదట్లో పొత్తుల్లో భాగంగా బీఆర్ఎస్ తరపున అభ్యర్థులను కూడా నిలపాలని అనుకున్నారు. అయితే వివిధ కారణాలతో అభ్యర్థులను దింపే విషయమై వెనకడుగు వేశారు. అందుకనే జేడీఎస్ అభ్యర్థుల గెలుపుకు అన్నీ విధాలుగా సహకరించాలని మాత్రం కేసీయార్ డిసైడ్ అయ్యారట. జాతీయరాజకీయాల్లో యాక్టివ్ రోల్ పోషించాలని అనుకుంటున్న కేసీయార్ మొదటి అడుగు కన్నడ రాజకీయాల్లో ఎలాంటి ఫలితం ఇస్తుందో చూడాల్సిందే.

# సంపాదకీయం

## స్ట్రాంగ్ అవుతున్న వైరస్

చైనాలో పుట్టిన కరోనా వైరస్ ప్రపంచం అంతా వ్యాపించి ఉంది. ఇప్పుడు ఒక దేశంలో ఉంది మరో దేశంలో లేదు అని కాకుండా ప్రతి దేశంలో కేసులు నమోదు అవుతున్నాయి. అయితే భారత్ లో కోవిడ్ ఉధృతి తగ్గుముఖం పట్టింది. కానీ ఇతర దేశాల్లో మాత్రం మరల కేసులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక హెచ్చరిక జారీ చేసింది. కరోనా మహమ్మారి ఇంకా బలంగా ఉందని చెప్పింది. గతంలో పాటించిన విధంగా కొవిడ్ నిబంధనలు పాటించాల్సి ఉంటుందని చెప్తుంది. కోవిడ్ ఇంకా బలపడుతున్న నేపథ్యంలో కొత్త వేరియంట్లు మరిన్ని పట్టుకుని రావచ్చని చెప్తుంది ప్రపంచ ఆరోగ్య సంస్థ. ప్రజలు ఎవరూ కూడా వైరస్ ను తక్కువ అంచనా వేయవద్దు అని అంటుంది. అందుకో మరోసారి వైరస్ వ్యాప్తికి సంబంధించి మరోసారి కొన్ని కీలక సూచనలు జారీ చేసింది. సుమారు రెండేళ్ల తర్వాత చైనాలో కోవిడ్ కేసులు భారీగా వెలుగు చూస్తున్నాయి. చైనాలో కేసులు పెరిగిన ప్రతీసారి ఏదో ఒక రూపంలో కోవిడ్ కల్లోలం కొనసాగుతుంది. దీంతో పెరుగుతున్న కేసులు మరింత భయపడాల్సి వస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పింది. అంతేగాకుండా ఇప్పటికీ వైరస్ కు సంబంధించిన కొన్ని కొత్త వేరియంట్లు పుట్టుకు రావచ్చు అనే మాట కూడా వినిపిస్తోంది. ఇదే జరిగితే నాలుగో వేవ్ కచ్చితంగా వస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తుంది. ప్రస్తుతం కరోనా కేసులు ఎక్కువగా ఆసియాలోని చైనాతో పాటు హాంకాంగ్ లో కూడా నమోదు అవుతున్నాయి. దీంతో పాటు యూరోపియన్ దేశాల్లో కూడా వైరస్ ఉధృతి కొనసాగుతోంది. మరణాలు సంఖ్య పెద్దగా లేకపోవడం తో ప్రజలూ ఊపిరి పీల్చుకున్నారు. కానీ వైరస్ వ్యాప్తిలో ఇంకా ఎక్కువగానే ఉంది అని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికీ చెప్తూనే ఉంది. దీంతో ప్రజలు కచ్చితంగా కోవిడ్ ప్రోటోకాల్ ను పాటించాల్సిన అవసరం ఉందని చెప్పింది. మరో వైపు చైనాలో సుమారు రెండేళ్ల తర్వాత కేసుల సంఖ్య భారీగా వెలుగు చూడడమే కాకుండా ఇప్పటికే రెండు మరణాలు కూడా సంభవించినట్లు ఆ దేశ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందుకుగానూ చైనాలో చాలా ప్రావిన్స్ లో లాక్ డౌన్ విధించినట్లు పేర్కొన్నారు. వైరస్ మరింత బలపడడంతో పాటు వ్యాక్సిన్ లు తీసుకుంటే శరీరంలో వ్యాధి నిరోధక శక్తి కూడా తగ్గుముఖం పడుతుంది ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారులు చెబుతున్నారు. మరోవైపు కోవిడ్ ఇంకా సీజనల్ వ్యాధిలా మారలేదని అంటున్నారు. అందుకే కోవిడ్ ప్రోటో కాల్ పాటించాలని ముఖ్యంగా వ్యక్తుల మధ్య దూరం తో పాటు మాస్కులు ధరించడం వంటివి చేయాలని పేర్కొన్నారు.

# శిథిల రహదారులకు మోక్షం



కరీంనగర్ : ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి దూరంగా ఉన్న శిథిల రహదారులకు మోక్షం లభించింది. రోడ్లు బాగు చేయాలని స్థానికులు పలుమార్లు విజ్ఞప్తులు చేసినా.. నగరపాలక అధికారులు సరిపడా నిధులు లేక ప్రతిపాదనలకే పరిమితమయ్యారు.. ప్రస్తుతం ఆ పనులు ప్రారంభించడంతో ఆయా ప్రాంతవాసుల ఇబ్బందులన్నీ దూరం కానున్నాయి. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పెరుగుతున్న జనాభాతో పాటు వాహనాలు విపరీతంగా పెరిగాయి. దీనికి తోడుగా అంతర్గత రహదారుల అభివృద్ధి మాత్రం జరగడం లేదు. ఇన్నాళ్లు నిధులు లేక అవస్థలు పడిన నగరపాలికకు స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు ఎంతోగానో తోడ్పాటు అందించింది. నగరవ్యాప్తంగా ఎంపిక చేసిన డివిజన్లలో అన్ని హంగులతో రహదారులు, డ్రైనేజీలు, నడకదారులు, లైటింగ్ సౌకర్యం, తాగునీటి సరఫరా మెరుగు పర్చడం వంటి పనులు చేస్తున్నారు. ఈ పనులు చేస్తుండగానే నగరవాసులకు ఉపయోగపడేలా కమాండ్ కంట్రోల్, ట్రాఫిక్ సిగ్నల్స్, కూడళ్లను అభివృద్ధి చేయడం, 24గంటల తాగునీరు తదితర ప్రాజెక్టుల పనులు కూడా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే మొదటి విడతలో 35కిలో మీటర్ల పొడవునా రహదారులను అందంగా తీర్చిదిద్దగా, రెండోవిడతలో రద్దీగా ఉండే 16 రహదారులు గుర్తించారు. రెండు వైపులా మురుగునీటి కాల్వలు నిర్మిస్తారు. మొదటి విడత తరహాలోనే రహదారి విస్తరణను బట్టీ పనులు చేపట్టేలా కార్యాచరణ తీసుకున్నారు. అందులో భాగంగా నాలుగైదు చోట్ల పనులు కూడా ప్రారంభించారు. ఈ పనులన్నీ వేగంగా పూర్తి చేయాలని మేయర్ వై.సునీల్‌రావు ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులను ఆదేశించారు. వచ్చే నెలాఖరులోగా రోడ్ల పనులు పూర్తి చేయాలని లక్ష్యాన్ని విధించారు.

పండుగలోస్తే ప్యాచ్ వర్క్

పలు వీధుల్లోని రహదారులు పరిశీలిస్తే రాకపోకలు సాగించడం గగనంగా మారుతోంది. వినాయకచవితి, బతుకమ్మ పండుగ సందర్భంగా ఆయా రోడ్లను ప్యాచ్ వర్క్ చేస్తున్నారు. మరమ్మతులు చేసిన నెల రోజులకే ఎక్కడికక్కడే ఊడిపోతుండగా ఎప్పటి గుంతలు అప్పటిలాగే తయారు అవుతున్నాయి. రెండోవిడతలో ఎంపిక చేసిన కొన్ని రోడ్లపై ఏటా పండుగల సమయంలో ప్యాచ్ వర్క్ చేస్తున్నారు. వర్షం పడితే ఎప్పటిలాగే గుంతలుగా మారుతుండటంతో ప్రజలు కూడా ప్రత్యామ్నాయదారుల గుండా ప్రయాణించాల్సిన పరిస్థితి ఉండేది. వచ్చే వర్షాకాలంలో ఈ సమస్యలన్నీ మాయం కానున్నాయి.

పనులు ఇవే.. సుభాష్‌నగర్ విగ్రహం–సీతారాంపూర్ వైపు
గణేశ్‌నగర్ డ్రైయిన్– హైదరాబాద్ రోడ్డు
రాజా థియేటర్ నుంచి గాంధీరోడ్డు వారసంత వరకు
నాకా చౌరస్తా– పాత పవర్‌హౌజ్ జంక్షన్
రాజు టీస్టాల్– అస్లాం మజీదు
హైదరాబాద్ మెయిన్ రోడ్డు– పోచమ్మవాడ
36వ డివిజన్ జయరాం ఆసుపత్రి పక్కన ఉన్న రోడ్డు
పరివార్ బేకరీ– సాయికృష్ణ థియేటర్ వైపు
14వ డివిజన్ బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ పక్కనున్న రహదారి
హోల్‌సెల్ వెజిటేబుల్ మార్కెట్– నేతబజారు(శనివారం అంగడి)
రాంనగర్ చేపల మార్కెట్– ధన్గర్‌వాడీ స్కూల్ రోడ్డు
వావిలాలపల్లి తేజ స్కూల్ రోడ్డు
డీఎఫ్ఓ జంక్షన్– మంచిర్యాల చౌరస్తా
33వ డివిజన్ సాయి సూపర్ మార్కెట్– పవన్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్

వర్షం పడితే నరకయాతన

నగర వీధుల్లోని పలు రోడ్లపై వర్షం పడితే చాలు గుంతలు ఇబ్బందికరంగా మారుతున్నాయి. భూగర్భ డ్రైనేజీ పనుల కారణంగా తవ్వడంతో అవి శిథిలమయ్యాయి. పలుమార్లు తాత్కాలికంగా మరమ్మతులు చేసినా ముణ్నాళ్ల ముచ్చటగా మారుతుంది. గుంతలలో మట్టి, కంకర పొడి పోయడంతో దుమ్ము, ధూళితో అవస్థలు పడాల్సి వస్తోంది. పైగా మురుగునీటి కాల్వలు అధ్వానంగా మారాయి. మురుగునీరంతా నిలిచి ఉండి దుర్వాసన వస్తుందనే ఫిర్యాదులు కూడా ఉంటున్నాయి.

నిధులు: స్మార్ట్‌సిటీ మొత్తం రోడ్లు: 16
కిలోమీటర్లు: 11.06

# క్లరికల్ ఉద్యోగులపై పనిభారం




కరీంనగర్ : సింగరేణిలో క్లరికల్ ఉద్యోగులపై పని భారం పెరుగుతోంది. ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోకపోవడంతో ఉన్నవాటితోనే సర్దుకుంటున్నారు. దీంతో క్లరికల్ ఉద్యోగులు అధికంగా పనిచేయాల్సి వస్తోంది.. 2014లో విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా 400 మంది క్లరికల్ సిబ్బందిని నియమించారు. అప్పటి నుంచి మళ్లీ క్లరికల్ సిబ్బందికి నేరుగా ఉద్యోగాల్లోకి తీసుకోలేదు. సంస్థాగతంగా ఖాళీలను భర్తీ చేయలేదు. ప్రస్తుతం కారుణ్య నియామకాల ద్వారా 12 వేల మంది యువ ఉద్యోగులను నియమించిన సింగరేణి ఇప్పటివరకు కొత్తగా నియామకాలు చేపట్టలేదు. సీనియర్ క్లర్కులు చాలా మంది ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. దీంతో కొత్తగా నియామకాలు లేకపోవడం, డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పని విధానం తెలియకపోవడంతో కొంత ఇబ్బంది ఏర్పడుతోంది. సీనియర్ క్లరికల్ సిబ్బంది వద్ద జూనియర్‌లకు పనులు కల్పించడం ద్వారా విధులకు సంబంధించిన పని విధానాన్ని నేర్చుకునే అవకాశం ఉంటుంది. 3000 పైగా ఉన్న క్లరికల్ సిబ్బంది ప్రస్తుతం 1500లకు తగ్గారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు విద్యావంతులు ఎక్కువగా ఉండటంతో యాజమాన్యం వారిని డిప్యూటేషన్ కింద క్లరికల్ విధులకు వినియోగించుకుంటోంది. కంప్యూటర్‌పై అవగాహన ఉన్న వారిని ఆ పనులకు వినియోగించుకుంటోంది. కానీ, వారికి మజ్దూర్ వేతనాలు చెల్లిస్తున్నారు. విద్యావంతులు ఎక్కువగా ఉన్న సింగరేణిలో అంతర్గతంగా క్లరికల్ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తే పరీక్షలు రాసేందుకు ఎదురుచూస్తున్నారు. యాజమాన్యం ఇప్పటి వరకు క్లరికల్ ఉద్యోగ ఖాళీల నియామక ప్రకటన విడుదల చేయడం లేదు.

అంతర్గత నియామకంపై ఆశలు

చాలా మంది ఉద్యోగులు అంతర్గత నియామకం కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల ఉద్యోగంలో చేరిన వారు ఇంజినీరింగ్, పీజీ, డిగ్రీలు పూర్తిచేసిన వారు ఎక్కువగా ఉన్నారు. ముందుగా అంతర్గతంగా ఖాళీలను భర్తీ చేయడం ద్వారా తమ అవకాశాలను పరీక్షించుకోవడానికి ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. సింగరేణి యాజమాన్యం కొంత కాలంగా క్లరికల్ ఉద్యోగ నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేస్తామన్న ప్రచారం చేసింది. ముందుగా బయటి వారితో నియామకాలు చేపడుతామన్న విషయంలో కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి. అంతర్గతంగా అర్హత ఉన్న అభ్యర్థులు ఉండగా బయటి నుంచి తీసుకోవడం ఎందుకన్న వాదన వినిపించాయి. దీంతో అసలు క్లరికల్ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన ప్రక్రియను యాజమాన్యం పక్కన పెట్టింది. సింగరేణిలో సంక్షేమ విభాగంతో పాటు అకౌంట్స్, పర్సనల్, ఆడిట్, సివిల్, గనులు, స్టోర్, వర్క్‌షాపులతో పాటు ప్రతి విభాగంలో క్లరికల్ సిబ్బంది అవసరం. క్లరికల్ సిబ్బంది కార్యాలయ పనులు నిర్వహిస్తేనే ఉద్యోగులకు సంబంధించిన పనులు ముందుకు సాగుతాయి. కీలకమైన క్లరికల్ సిబ్బంది కొరతను నివారించేందుకు యాజమాన్యం భర్తీ ప్రక్రియను చేపట్టడం లేదన్న ఆందోళన ఉద్యోగుల్లో నెలకొంది.

నిబంధనపై సందిగ్ధం

అంతర్గత నియామకాలకు కనీసం అయిదేళ్ల సర్వీసు కంపెనీలో ఉండాలన్న నిబంధనను యాజమాన్యం ముందుకు తీసుకొచ్చింది. అంతర్గత క్లరికల్ నియామకానికి అర్హులైన ఉద్యోగులు సంస్థలో కనీసం ఐదేళ్లు పనిచేసిన వారై ఉండాలన్న నిబంధనతో చాలా మంది ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్ల సర్వీసు నిబంధన తొలగించి అర్హులైన వారితో నియామక ప్రక్రియ చేపడితే తమ అదృష్టాన్ని పరీక్షించుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

# వయసుకు తగిన బరువుండేలా చూడాలి



చొప్పదండి : చిన్నారుల్లో పోషకాహార లోపం లేకుండా వయస్సుకు తగిన బరువుండేలా చూడాలని జిల్లా అదనపు పాలనాధికారి గరిమా అగ్రవాల్ అన్నారు. పట్టణంలోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పుర అధ్యక్ష, ఉపాధ్యక్షురాళ్లు నీరజ, విజయలక్ష్మి, జిల్లా సంక్షేమాధికారి పద్మావతి, కమిషనర్ అంజయ్య, సీడీపీవో కస్తూరి, కౌన్సిలర్లు గంగరాజు, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు. పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీవో ఉమారాణి అన్నారు. మంగళవారం కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రోత్ మానిటరింగ్ డే నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ పర్యవేక్షకులు అరుణ, స్వప్న, రాజేశ్వరి, రాజమణి, పోషణ్ అభియాన్ ప్రతినిధులు సతీష్, అనిత పాల్గొన్నారు.

# ఆమె తల్లడిల్లుతోంది..!

వరంగల్ : ఉమ్మడి జిల్లాలో ఇటీవల ఏదో ఒకచోట మహిళలు, యువతులు వేధింపులకు గురవుతున్న ఘటనలు జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, కార్యక్రమాల గురించి అవగాహన లేకపోవడంతో ఎవరికీ చెప్పుకోలేక బాధితులు లోలోపల మధనపడుతున్నారు. చట్టాల సహకారంతో ఫిర్యాదు చేస్తే పోలీసులు నేరుగా కేసు నమోదు చేసి న్యాయం జరిగేలా చూస్తారు. ఈ నేపథ్యంలో మహిళలపై వేధింపులు.. వారి రక్షణకు ఉన్న అవకాశాలపై ప్రత్యేక కథనం.

చట్టం శిక్షిస్తుంది జాగ్రత్త..

హనుమకొండ హంటర్‌రోడ్డులో 2019లో సాయికుమార్ అనే యువకుడు యువతిని పుట్టిన రోజున బయటకు తీసుకెళ్లి అత్యాచారం చేసి హత్య చేశాడు. దీనిపై సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా సాయికుమార్ విచారణ ఖైదీగా జైలులో ఉన్నాడు.

లి హనుమకొండ ఠాణా పరిధిలో 2019 నవంబరులో తొమ్మిది నెలల చిన్నారిపై ప్రవీణ్ అనే యువకుడు అత్యాచారం చేసి హత్య చేశాడు. కింది కోర్టు ఉరిశిక్ష విధించిది. దీన్ని హైకోర్టు యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది. ప్రస్తుతం ప్రవీణ్ జైలులో ఉన్నాడు.

ఇటీవల జరిగిన ఘటనలు

లి గతనెల హనుమకొండ ఠాణా పరిధిలో పెద్దమ్మగడ్డ ప్రాంతంలో యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి యువకుడు మోసం చేసి అత్యాచారం చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

లి ఇటీవల కమలాపూర్ ఠాణా పరిధిలో బాలికపై యువకుడు అత్యాచారం చేశాడు. బాధిత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

లి ములుగు జిల్లాలో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ నయింనగర్‌లో గది అద్దెకు తీసుకొని పలుసార్లు ఓ యువతిపై అతాచ్యారం చేశాడు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేశారు.

వీటి గురించి తెలిసి ఉండాలి..

లి 2013 లైంగిక వేధింపుల చట్టం: ఆకతాయిల నుంచి లైంగిక వేధింపులు ఎదురైతే నేరుగా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయొచ్చు.

లి 1986 మహిళ రక్షణ చట్టం: అశ్లీల దృశ్యాలను చిత్రీకరించడం



సంబంధిత విషయాలలో ప్రమేయం చేసి మాట్లాడడంవంటి చర్యలకు పాల్పడితే బాధ్యులు శిక్షార్హులవుతారు.

లి ఐపీఎస్ సెక్షన్ 376: అత్యాచారానికి గురైన సమయంలో దీని కింద కేసు నమోదు చేస్తారు. నేరం రుజువైతే కఠిన కారాగార శిక్షలు ఉంటాయి.

లి 354: మహిళల మనోభావాలను కించపరిచినా, నలుగురిలో అవమానించినా, ఒంటరిగా వెళ్లే సమయంలో ఇబ్బంది పెట్టినా, వారి అనుమతి లేకుండా ఫొటోలు తీసినా, అత్యాచారయత్నానికి పాల్పడినా చర్యలు తీసుకుంటారు.

లి 509: ఉద్దేశపూర్వకంగా అవమానించిడం, ఏదైనా వస్తువులను చూపిస్తూ వింతైన శబ్దంతో వారి విధులకు ఆటంకం కలిగించడంలాంటివి చేస్తే జైలు శిక్ష విధిస్తారు.

లి 354డీ/2: చరవాణిలో మాట్లాడమని వేధించడం, సంక్షిప్త సందేశం, ఇంటర్నెట్ ద్వారా అవమానపర్చడం, అసభ్యంగా మాట్లాడడంలాంటి కార్యకలాపాలకు పాల్పడితే అరెస్టు చేస్తారు.

ధైర్యంగా ఫిర్యాదు చేయాలి
– క్రైం అదనపు డీసీపీ కె. పుష్పారెడ్డి

మహిళలు సమస్యలు వచ్చినప్పుడు ధైర్యంగా ఠాణాకు వచ్చి లేదా సామాజిక మాధ్యమాల ద్వారా ఫిర్యాదు చేయవచ్చును. మహిళలు ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందిస్తారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతారు. నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు భరోసా కల్పిస్తారు.

గతంలో కంటే మార్పు వచ్చింది
– న్యాయవాది సుధారాణి

మహిళలపై దాడులు, వేధింపులు జరిగితే పూర్తి సాక్ష్యాలతో నిందితులను కోర్టులో ప్రవేశపెడితే న్యాయం జరుగుతుంది. గతంలో కంటే ఇప్పుడు చాలా మార్పులు వచ్చాయి. సాంకేతికపరమైన సాక్ష్యాలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు. మహిళల విషయంలో ప్రత్యేక కోర్టులు ఉన్నాయి. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు పెడతారు.

ఇలా ఫిర్యాదు చేయొచ్చు

హాక్‌ఐ: పోలీసుశాఖ నుంచి హాక్‌ఐ యాప్ ద్వారా రక్షణ పొందొచ్చు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో అన్ని పోలీసు అధికారుల చరవాణి నెంబర్లు, ఠాణాల నెంబర్లు, ఉన్నతాధికారుల సమాచారం ఇందులో ఉంటుంది. దీని ద్వారా ఇతరులకు తెలియకుండా పోలీసులకు ఫిర్యాదు చేయొచ్చు.

వాట్సాప్: 94910-89257 ద్వారా సమాచారం ఇవ్వొచ్చు. ఫొటోలను చిత్రీకరించి పంపించవచ్చు.

షీ బృందాలు: ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులకు గురైన సమయంలో షీ బృందాలకు ఫిర్యాదు చేయాలి. లేదా డయల్ 100కు చేస్తే వారు షీ బృందానికి సమాచారం ఇస్తారు. షీ బృందం సభ్యులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుంటారు.

కమిషనరేట్ పరిధిలో నమోదైన అత్యాచారం కేసులు

# విద్యార్థుల నుంచి అదనపు వసూళ్లు

వరంగల్ : హాజరుశాతంలేని విద్యార్థుల నుంచి డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు అదనపు ఫీజులను ముక్కుపిండి వసూళ్లకు పాల్పడుతున్నాయి. కాకతీయ విశ్వవిద్యాలయం మేలో జరగబోయే డిగ్రీ రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్ల పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లింపు తేదీలను ఇటీవల విడుదల చేసింది. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 25 వరకు, రూ.50 జరిమానాతో 29 వరకు ఫీజు చెల్లించవచ్చని వర్సిటీ పేర్కొంది. వర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు తరగతులకు హాజరుకాని విద్యార్థుల నుంచి జరిమానా పేరిట పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. డిగ్రీ ప్రవేశాల సమయంలో పరీక్ష ఫీజు తప్ప ఎలాంటి ఫీజులు ఉండవని విద్యార్థులను చేర్పించుకున్న కళాశాలలు సందర్భాన్నిబట్టి ఫీజులు అధికంగా వసూళ్లు చేయడాన్ని ఖండిస్తున్నారు.

**తనిఖీలు అంతంత మాత్రమే..**

వర్సిటీ అధికారులు ప్రైవేటు కళాశాలలను సందర్శించి అన్ని వసతులు, సౌకర్యాలు విద్యార్థులకు కల్పిస్తున్నారా లేదా పరిశీలించాలి. ఇలా చేయకపోవడం వల్లే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కేయూ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వర్సిటీలో కొంతమందికి కొంతమొత్తం చెల్లించడంతో ప్రైవేట్ కళాశాలల వైపు చూడటంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. హాజరుశాతం పేరిట



అక్రమంగా జరిమానా వసూలు చేస్తున్న కళాశాలలపై కేయూ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

**పేద విద్యార్థులే అధికం..**

డిగ్రీ కోర్సులు చదివే చాలా మంది విద్యార్థులు పేద కుటుంబాలకు చెందిన వారే. ప్రభుత్వం అందించే ఫీజు రీయంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలతో విద్యను అభ్యసిస్తున్నారు. గతంతో పోల్చితే ఎక్కువ మంది ప్రైవేటు, పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తు తరగతులకు హాజరవుతున్నారు. నిత్యం కళాశాలకు రాకపోవడంతో హాజరుశాతం తగ్గుతుంది. అదే విధంగా అమ్మాయిలు కొంతమందికి వివాహాలు కావడం, మరికొంత మంది విద్యార్థినులు వివిధ రుగ్మతలతో తరగతులకు హాజరుకాలేక పోయారు. 70 శాతం హాజరు శాతం లేని విద్యార్థుల నుంచి రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు. 60,50,40 శాతానికి హాజరు పడిపోతే ఫీజు పెంచుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు. హాజరు శాతాన్ని బట్టి అదనపు ఫీజులు చెల్లించాల్సిందేనని కళాశాలల వారు చెప్పడంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. ఈ అదనపు మొత్తం చెల్లించాకే పరీక్ష ఫీజును తీసుకోవడం గమనార్హం. అదనపు ఫీజుకు ఎలాంటి రశీదు ఇవ్వడం లేదు. 50శాతం మంది విద్యార్థులకు కూడా హాజరుశాతం లేదంటే ఆశ్చర్యం కలగకమానదు. వర్సిటీ నిబంధనల మేరకే వసూలు చేస్తున్నామని కళాశాలల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ప్రతి సెమిస్టర్‌కు విద్యార్థుల నుంచి ఇలా జరిమానాలు తీసుకుని అదనపు ఆదాయాన్ని కళాశాలలు పొందుతున్నాయి.

**ఎలాంటి ఫీజులు ఉండవని చెప్పారు : – కె.జ్యోతి, భీమారం**

నగరంలోని ఓ ప్రైవేటు మహిళా డిగ్రీ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్నా. నాకు వివాహమైంది. మూడు నెలల బాబు ఉన్నాడు. నిత్యం తరగతులకు హాజరుకాలేదు. దీంతో వెయ్యి రూపాయల జరిమానా చెల్లిస్తేనే పరీక్ష ఫీజు తీసుకుంటామని చెబుతున్నారు. ముందుగానే యాజమాన్యానికి మా తల్లిదండ్రులు సమాచారం ఇచ్చారు. మొదట ఎలాంటి ఫీజులు ఉండవని చెప్పి ఇప్పుడు ఇలా ఇవ్వమంటున్నారు.

**రూ.4వేలు చెల్లించా : – భూక్య రమేశ్, నర్సంపేట**

హనుమకొండలోని ఓ ప్రవేట్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నా. గదిని అద్దెకు తీసుకొని స్నేహితులతో కలిసి ఉంటున్నాను. ఆర్థిక సమస్యలు ఉండటంతో ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులకు కొంత నగదును పంపిస్తున్నాను. రోజూ కళాశాలకు వెళ్లలేదు. గత్యంతరం లేక నాలుగు సెమిస్టర్లకు రూ.4వేలు చెల్లించాను. ప్రవేశాల సమయంలో కాలేజీకి రాకున్న అంతా మేం చూసుకుంటామని చెప్పి మాట మార్చారు.

**అరవై శాతం ఉన్నా.. – తేజస్విని, హనుమకొండ**

డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. అరవైశాతం హాజరు ఉన్న రూ.300 చెల్లించమన్నారు. రశీదు అడిగితే ఇవ్వలేదు. కుటుంబ సమస్యల కారణంగా కళాశాలకు వెళ్లలేదు. పరిస్థితిని చెప్పిన వినలేదు. పరీక్ష ఫీజు కోసం జరిమాన చెల్లించాను.

**అధిక ఫీజులు వసూలు చేయొద్దు : – ఆచార్య పి.మల్లారెడ్డి, కేయూ పరీక్షల నియంత్రణ అధికారి**

హాజరు మినహాయింపు కోసం ఫీజుల పేరిట విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయద్దు. కేయూ నిబంధనల మేరకే వసూలు చేయాలి. ఆరోగ్యపరమైన సమస్యలుంటే వైద్య ధ్రువీకరణపత్రం చూసి మినహాయించాలి. కళాశాలలపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

## జాతీయ రహదారి విస్తరణకు అడ్డంకులు

జయశంకర్ : తెలంగాణ–మహారాష్ట్రలను కలిపే 353సీ జాతీయ రహదారి పనులు కాళేశ్వరం–మహదేవపూర్ మధ్య 17 కిలోమీటర్ల మేర పెండింగ్‌లో ఉన్నాయి.. గతేడాది నవంబర్ 12వ తేదీన రామగుండం ఎరువుల కర్మాగారాన్ని జాతికి అంకితం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ అదే రోజున రూ.163 కోట్ల నిధులతో నిర్మించతలపెట్టిన కాళేశ్వరం–మహదేవపూర్ రహదారికి శంకుస్థాపన చేశారు.టెండర్లు పూర్తయి నాలుగు నెలలు కావస్తున్నా నేటికీ పనులు ప్రారంభం కావడం లేదు. అటవీ శాఖ అనుమతులు, భూసేకరణ సమస్యలు కొలిక్కి రావడం లేదు. కాళేశ్వరం వద్ద గోదావరిపై నిర్మించిన అంతర్రాష్ట్ర వంతెన నిర్మాణంతో ఈ రహదారి నుంచి రాకపోకలు మరింత పెరిగాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి కూడా వెళ్లవచ్చు. ఈ రహదారి మూడు రాష్ట్రాలకు కీలకంగా మారింది. కానీ, కాళేశ్వరం–మహదేవపూర్ మధ్య రహదారి అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు రహదారి కష్టాలను ఎదుర్కొంటున్నారు. 353స్మీ జాతీయ రహదారి మన రాష్ట్రంలో కాళేశ్వరం నుంచి మొదలై ఆత్మకూరు మండలం గుడెప్పాడ్ వరకు ఉంటుంది. దాదాపు 101 కి.మీ సాగుతుంది.

# అభాగ్యులం.. ఆదుకోరూ..!



ఖమ్మం : కనీసం నడవలేని స్థితిలో తల్లి ఒకవైపు.. మానసిక దివ్యాంగుడైన కుమారుడు మరోవైపు. ఇది చాలదన్నట్లు తనకు తీవ్ర అనారోగ్య సమస్యలు.. అయినా తానే వారిద్దరికీ పెద్ద దిక్కు. ఇక వర్షం వస్తే లోతట్టున ఉన్న ఇంటికి వరద ముంచెత్తోంది. ఇలా ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ దర్భర జీవనం గడుపుతోంది ఓ కుటుంబం. ఇది ఓ తల్లీ, కూతురు, ఆమె కొడుకు దయనీయ గాథ.

**తల్లి, కుమారుడికి అన్నీ తానవుతూ..**

చింతకాని మండలం నాగిలిగొండకు చెందిన 85 ఏళ్ల సంపసాల ముత్తమ్మ, ఆమె కుమార్తె పిచ్చమ్మ, పిచ్చమ్మ కుమారుడు ఎల్లయ్య గత కొన్నేళ్లుగా రేకుల ఇంట్లో నివసిస్తున్నారు. ముత్తమ్మ భర్త నారాయణ ఇరవై ఏళ్ల క్రితం మరణించాడు. ఆమె పదిహేనేళ్ల క్రితం ప్రమాదానికి గురవ్వటంతో కనీసం నడవలేని పరిస్థితిలో దేకుతూ ఇంట్లో అటూ, ఇటూ కదులుతోంది. ఆధార్ కార్డు నమోదుకు సైతం వేలిముద్రలు సరిగ్గా పడకపోవటంతో పింఛను కూడా రావటం లేదు. ఇక ఆమె కుమారుడు ముత్తమ్మను పట్టించుకోకుండా ఎటో వెళ్లిపోయాడు. కూతురు పిచ్చమ్మను భర్త వదిలేయటంతో పదిహేనేళ్లుగా తల్లి వద్దే మానసిక దివ్యాంగుడైన కుమారుడు ఎల్లయ్యతో కలిసి ఉంటోంది. పిచ్చమ్మకు వచ్చే వృద్ధాప్య పింఛన్, దివ్యాంగుడైన ఎల్లయ్యకు అందుతున్న ఆసరా పింఛన్‌పైనే ముగ్గురు జీవించాల్సిన దుస్థితి. పిచ్చమ్మకు ఇటీవల అనారోగ్య సమస్య తలెత్తింది. ఆరోగ్య పరిస్థితి బాగోలేదనీ ఆమె పేర్కొంది. ప్రస్తుతం తల్లి ముత్తమ్మ, కుమారుడు ఎల్లయ్యలను పిచ్చమ్మ కంటికి రెప్పలా కాపాడుతూ పోషిస్తోంది. కనీసం వారుండేందుకు ఇల్లు కూడా సరిగా లేదు. కేవలం నాలుగు మూలలు పరదా పట్టాలు కట్టిన తాత్కాలిక రేకుల షెడ్డులో గత కొన్నేళ్లుగా నివాసముంటున్నారు. వర్షం కురిసినప్పుడు తమ ఇల్లు లోతట్టున ఉండటంతో ఇంట్లోకే నీరు వస్తోందని వారు వాపోతున్నారు. నెలనెలా ఇద్దరికీ వచ్చే ఆసరా పింఛన్ ముగ్గురికి మందులకే సరిపోతున్నాయనీ.. కనీసం తిండికి కూడా ఇతరులపై ఆధారపడాల్సి వస్తోందని పిచ్చమ్మ కన్నీరుమున్నీరవుతోంది. తమ రేకుల గదికి కనీసం విద్యుత్తు, మరుగుదొడ్డి సౌకర్యం కూడా లేదు. అధికారులు స్పందించి ఆధార్‌కార్డు ఇప్పించటతోపాటు నెల నెలా ఆసరా పింఛన్ ఇప్పించాలని ముత్తమ్మ వేడుకుంటోంది. దాతలు స్పందించి ఓ గది నిర్మించి ఇవ్వాలని ముగ్గురూ అర్థిస్తున్నారు.

దాతలు సంప్రదించాల్సిన నెంబర్: 9394450050

# ఆలయాల భూములపై ప్రైవేటు పెత్తనం




వరంగల్ : 'కోట్ల రూపాయల విలువ చేసే దేవాలయాల భూములపై ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చెలాయిస్తున్నారు. దేవస్థానం ఏర్పాటు చేసిన భూములను రాత్రికి రాత్రే తొలగించేస్తున్నారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని పలు ఆలయాల స్థలాలు సొంతం చేసుకునే పనిలో ఉన్నారు. కార్యనిర్వహణాధికారులు(ఈవో)ను లెక్క చేయడం లేదు. విలువైన స్థలాలపై వరంగల్ ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. హనుమకొండ పద్మాక్షి, వీరపిచ్చమాంబ, సిద్దేశ్వరస్వామి, వరంగల్ వేణుగోపాలస్వామి దేవాలయాల భూముల ఆక్రమణలపై లోకాయుక్త న్యాయస్థానం సీరియస్‌గా ఉంది. వచ్చే జూన్ మొదటి వారం కల్లా సమగ్ర సర్వే పూర్తి చేసి నివేదిక సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు. హనుమకొండలో నాలుగు ఆలయాలకు చెందిన సుమారు 21.16 ఎకరాల భూమి ప్రైవేటు చెరలో ఉన్నాయని జిల్లా దేవాదాయ శాఖాధికారులంటున్నారు. క్షేత్రస్థాయిలో చర్యలకు వెనుకంజ వేస్తున్నారు.'ఇవిగో ఉదాహరణలు.. హనుమకొండ పద్మాక్షి దేవాలయానికి చెందిన స్థలాల్లో రెండు, మూడు నెలల క్రితం బోర్డులు ఏర్పాటు చేశారు. వారం రోజుల్లో రాత్రికి రాత్రి తొలగించేశారు. సుమారు 2.16 ఎకరాల్లో ప్రైవేటు నిర్మాణాలున్నాయి. వీరపిచ్చమాంబ ఆశ్రమానికి చెందిన స్థలాల్లో బోర్డులు పెట్టకుండా ఆక్రమణదారులు అడ్డుకుంటున్నారు. రాజకీయ పలుకుబడితో పెత్తనం చెలాయిస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన స్థలాలు ఆక్రమించేశారు. హనుమకొండ శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయం భూముల లెక్క తేలడం లేదు. రెవెన్యూ శాఖాధికారులు సమగ్ర సర్వే చేపట్టడం లేదు. ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారంగా భవన నిర్మాణాలు చేపట్టారు. బోర్డులు కనిపించడం లేదు. హనుమకొండ పెద్దమ్మగడ్డ శివారు కాకతీయ కెనాల్ సమీపంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం(చిన్న కోవెల) భూములపై కన్ను పడింది. రెండు నెలల క్రితం తాత్కాలిక గుడిసెలు తొలగించారు. దేవస్థానం ఏర్పాటు చేసిన బోర్డులు తరచూ తొలగిస్తున్నారు. వరంగల్ పాపయ్యపేట శ్రీమల్లికార్జునస్వామి(కుంటి భద్రయ్య గుడి) దేవస్థానం భూములు అన్యాక్రాంతమయ్యాయి. పేదలు గుడిసెలు వేసుకున్నారు. మిగిలిన ఖాళీ స్థలాలను గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేటు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. బోర్డులు తొలగించేశారు.

వరంగల్ బాలానగర శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులు తిష్ట వేశారు. ఇంత వరకు బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. వరంగల్ శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన విలువైన స్థలంపై ప్రైవేటు వ్యక్తుల కన్ను పడింది. గత కొన్నేళ్లుగా లీజు పేరుతో దక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

రంగశాయిపేట శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వ్యవసాయ భూములున్నాయి. కౌలు పేరుతో ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చెలాయిస్తున్నారు. బోర్డులు పెట్టాలి – ఆర్.సునీత, సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ వరంగల్ ఉమ్మడి జిల్లారాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశానుసారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దేవాలయాల భూములపై సర్వే, క్షేత్రస్థాయిలో బోర్డులు పెట్టడం జరిగింది. బోర్డులు తొలగిస్తున్న వారిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో సర్వే పూర్తయ్యాక హద్దులు ఖరారు చేస్తాం. బోర్డులు ఏర్పాటు చేస్తాం.

# పడిపోతున్న మొక్కజొన్న ధరలు

వరంగల్ : మొక్కజొన్నల ధర తగ్గడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత (మార్చి) నెలలో మక్కలు క్వింటాకు రూ.2,300 ధర పలికింది. పంట చేతికి వస్తున్న క్రమంలో రోజు రోజుకు ధరలు పడిపోయి నష్టాన్ని కలిగిస్తోంది. జిల్లాలో రబీలో సాగు 65,756 ఎకరాలు కాగా ఈఏడాది 88,415 ఎకరాల్లో వేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వం క్వింటాకు రూ.1,962ల మద్దతు ధరను నిర్ణయించింది. ఈ నెల మొదటి వారం దాకా రూ.2వేల నుంచి రూ.2,100 పలికిన ధర ఈ నెల 9 నుంచి క్రమేపి తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం నర్సంపేట మార్కెట్‌లో క్వింటాకు రూ.1500 నుంచి రూ.1850లకు కొనుగోలు జరుపుతున్నారు. మార్కెట్‌లో ధర తగ్గడానికి వ్యాపారులు కూటమిగా ఏర్పడడమే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**సాకులతో కొర్రీలు.. :** గ్రామాల నుంచి పెద్దమొత్తంలో మక్కలు రావడంతో మార్కెట్ కళకళలాడుతోంది. వ్యాపారులు తేమ, నాపలు(నాసిరకంగా) అంటూ కుంటి సాకులు చెబుతూ ధరలో కోత పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లైసెన్సుల్లేని కొందరు చిల్లర వ్యాపారులు గ్రామాల్లో కళ్లాల, పంట చేన్ల వద్దే ఎలాంటి ఖర్చు లేకుండా క్వింటాకు రూ.1700 నుంచి రూ.1800లకు కొంటూ శఠగోపం పెడుతున్నారు. ఇంత జరుగుతున్నా మార్కెట్ అధికారులు ఏమి పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

**నష్టాలే మిగిలాయి..:** పెరిగిన ఎరువుల ధరలు, కూలీ రేట్లు, దున్నుడు ఖర్చులకు తోడు వడగళ్ల వర్షం చుట్టుముట్టాయి. తెగుళ్లు, చీడపీడలతో ముప్పిరిగొన్న పంటను మార్కెట్‌కు తీసుకువస్తే మద్దతు మాటేమోగాని గిట్టుబాటు ధర రాకపోవడంతో ఖిన్నులవుతున్నారు. క్వింటా మక్కలకు డీఏపీ బస్తా ధర రావడం లేదని వాపోయారు. ఎకరాకు రూ.20–25వేలు పెట్టుబడి ఖర్చు వచ్చిందని కొమురయ్య అనే రైతు వివరించారు.

**జాడలేని కొనుగోలు కేంద్రాలు..:** రైతులు పండించిన మక్కలకు మద్దతు ధర లభించకుంటే మార్క్‌ఫెడ్ అధికారులు రంగంలోకి దిగి మద్దతు ధరకు కొనుగోలు చేసి అండగా నిలవాల్సి ఉంది. గత పది రోజుల నుంచి రోజు రోజుకు మార్కెట్‌లో మక్కల ధర పడిపోతున్నా అధికారులు కొనుగోలు కేంద్రాలను నెలకొల్పకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**ఏర్పాట్లు చేస్తున్నాం : మహేశ్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్, వరంగల్**

విపణిలో మక్కల ధర తగ్గిన విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. ఆదేశాలు రాగానే జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు జరిపేందుకు కసరత్తు చేస్తున్నాం.

ఈ రైతు పేరు గుగులోతు శక్రూ. నర్సంపేట మండలం ఆకులతండ గిరిజన రైతు. అదే గ్రామ శివారులోని 20 గుంటల సొంత భూమిలో మొక్కజొన్న పంట వేసి మూడు రోజుల క్రితం నర్సంపేట మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చాడు. నిర్ణీత తేమ శాతం రావడంతో నేడు వ్యాపారులు క్వింటాకు రూ.1701లకు కొన్నారు. ఇష్టం లేకున్నా అమ్మక తప్పలేదు. చెన్నారావుపేట మండలం ఈర్యతండాకు చెందిన అజ్మీర గణేశ్ యువరైతు. తండ్రితో కలిసి మూడెకరాల్లో మొక్కజొన్న పంట పండించాడు. నాలుగు రోజుల క్రితం మార్కెట్‌కు తెచ్చి తేమశాతం ఎక్కువగా ఉందంటే ఆరబోశాను. క్వింటా రూ.1800లకు కొన్నారు. ఎకరానికి రూ.23–25వేల పెట్టుబడి ఖర్చు పెట్టాం. తీరా విక్రయానికి తెస్తే తక్కువ ధరకు కొన్నారు. కనీసం క్వింటాకు రూ.2వేలు చెల్లిస్తే బాగుండేది.

ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు ఇస్లావతు రామచందర్ చెన్నారావుపేట మండలం అక్కలచెడ. మార్కెట్‌లో మక్కల ధర తగ్గుతున్నందున వెంటనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేపట్టాలి.

# అప్పుల ఊబిలో సర్పంచులు

జనగామ : గ్రామాల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యమంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. ఉత్తమ పంచాయతీలకు పురస్కారాలు ఇస్తున్నారు. అన్నీ బాగానే ఉన్నా.. గ్రామాభివృద్ధి కోసం వివిధ పనులు చేపట్టిన సర్పంచులకు ప్రభుత్వం నుంచి బిల్లులు రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. బిల్లుల కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. ఇటీవల ఓ జిల్లాలో.. చేసిన పనులకు బిల్లులు రాలేదన్న ఆవేదనతో ఓ సర్పంచి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు గ్రామాల్లో సర్పంచులు చేపట్టిన పల్లె ప్రగతి పనులకు బిల్లులు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి పనులు చేశామని, ఖజానా కార్యాలయంలో చెక్కులు జమ చేసినా బిల్లులు రావడం లేదని వాపోతున్నారు. జిల్లా పంచాయతీరాజ్, ఇంజినీరింగు శాఖల వద్ద సర్పంచులకు చెల్లించాల్సిన బకాయిల సమాచారమే లేదంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 77 మండలాలు ఉండగా 1688 పంచాయతీలున్నాయి. వీరిలో పలువురు సర్పంచులకు రూ.కోట్ల బకాయిలు రావాల్సి ఉంది.

**ఆదాయ.. వ్యయాలు ఇలా..**

పంచాయతీలకు పన్నులు, పన్నేతరాల ద్వారా ఆదాయం సమకూరుతుంది. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంస్థల నిధులు గ్రాంట్ల రూపేణా జమ కావాలి. జనగామ మండలం పెద్దపహాడ్ పంచాయతీకి నెల వారీగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 లక్షలు, ఎస్‌ఎఫ్‌సీ నుంచి రూ.1.50 లక్షలు రావాలి. ఏడాది నుంచి రాష్ట్ర ఆర్థిక సంఘం, కేంద్రం నుంచి నిధులు రాలేదు. జనవరిలో రూ.5 లక్షలు వచ్చాయి. ఫిబ్రవరి నుంచి ఈ నెల వరకు రూపాయి కూడా రాలేదు. ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, ఇతర ఆదాయాలను ఖజానా కార్యాలయంలో జమ చేశారు. పనులు చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు రాలేదని సర్పంచి పేర్కొన్నారు.

**ఖర్చులను పరిశీలిస్తే..**

పంచాయతీ సిబ్బంది ఎనిమిది మంది వేతనాలకు రూ.59000, విద్యుత్తు బిల్లు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు, ట్రాక్టర్ ఈఎంఐ, డీజిల్ ఖర్చు రూ.12 వేలు, నర్సరీల నిర్వహణ, మోటార్ల మరమ్మతులు ఇతర ఖర్చులు రూ.15 వేలు ఉంటాయి. గ్రామాభివృద్ధిలో భాగంగా సర్పంచి చేసిన పనులకు సంబంధించి చెక్కులు సమర్పించి నెలలు గడుస్తున్నా డబ్బులు రాలేదని చెప్పారు. క్రీడా ప్రాంగణాలు, రైతు వేదికల పనులకు సంబంధించిన బకాయిలు రావాల్సి ఉందన్నారు. నిధులు మంజూరైనా విద్యుత్తు బిల్లులకు మళ్లించారని చెప్పారు.

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వెంకంపాడు సర్పంచి టి.ఉప్పమ్మ చేసిన పనులకు బిల్లులు రాలేదు. గౌరవం వేతనం కూడా అందకపోవడంతో కుటుంబ పోషణ కోసం కూలి పనులకు వెళున్నారు.

**నెలలు గడుస్తున్నాయి–జి.శ్రీలత, సర్పంచి, పెద్దపహాడు, జనగామ జిల్లా**

రూ.10 లక్షలతో గ్రామంలో కల్వర్టు నిర్మించాం. సీసీ రోడ్లు వేశాం. నీటి సరఫరా వ్యవస్థ మరమ్మతులు అన్నీ కలిపి సుమారు రూ.8 లక్షలు రావాల్సి ఉంది. క్రీడా ప్రాంగణం పనుల డబ్బులు రావాలి. ఎంబీ రికార్డు కావాల్సినవి ఇంకొన్ని ఉన్నాయి. ఇటీవల మంత్రి కేటీఆర్ రూ.250 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించడంతో ఎదురు చూస్తున్నాం.

**రూ.20 లక్షల బిల్లులు రావాలి–పల్లెపు వెంకటనర్సింగరావు, సర్పంచి, జఫర్‌గఢ్**

పల్లె ప్రకృతివనం, డంపింగ్‌యార్డు, క్రీడాప్రాంగణాలు తదితర పనులకు సంబంధించి రూ.20 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. ఎంబీ రికార్డు అయినా, చెక్కులు సమర్పించినా రాలేదు. అప్పులపై వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాము.

**అప్పులు తెచ్చి పనులు చేయించాను–లింగంపల్లి ప్రసాదరావు, సర్పంచి, గూడపల్లి, రేగొండ మండలం, భూపాలపల్లి**

రూ.20 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేయించాను. రూ.22 లక్షల వరకు అప్పులు తెచ్చాను. చేసిన పనులకు బిల్లులు రావాల్సి ఉంది. నాలుగు నెలలుగా పంచాయతీ సిబ్బందికి వేతనాలు రావడం లేదు.

**కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంది–భూక్య రమేశ్, సర్పంచి, తాట్యా తండా, కురవి మండలం, మహబూబాబాద్ జిల్లా.**

కొత్తగా ఏర్పడిన పంచాయతీని అభివృద్ధి చేసేందుకు అప్పులు తెచ్చి పనులు చేయించాను. అసలు, వడ్డీ కలిపి రూ.30 లక్షల మేర అప్పులయ్యాయి. బిల్లులు రాలేదు. కుటుంబ పోషణకు కొలువు సాధించే యత్నంలో ఉన్నాను.

**ప్రభుత్వానికి నివేదిస్తాం– కె.రంగాచారి, డీపీవో, జనగామ**

సర్పంచులు, ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధిలో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో జిల్లా పంచాయతీ విభాగం ప్రమేయం ఉండదు. అయినా సర్పంచుల ఇబ్బందులను, బకాయిలను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తాం.

## ప్రత్యామ్నాయ చర్యలు ఏవి..?

మహబూబాబాద్ : ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ పథకంపై పూర్తి స్థాయిలో ఆధారపడి ప్రత్యామ్నాయ నీటి వనరులను ఏర్పాటు చేసుకోకుంటే మానుకోట పట్టణ ప్రజలకు తాగునీటి తిప్పలు తప్పవు. మిషన్ భగీరథ పనులు పూర్తి కాకపోవడం.. పైపులైన్ వేసిన ప్రాంతాల్లో ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చి నీటి సరఫరా చేస్తామంటున్న అధికారుల మాటలు పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. పట్టణంలో ఇటీవల తరుచుగా సాంకేతిక కారణాలు, మిషన్ భగీరథ అధికారులు, గుత్తేదారుల నిర్లక్ష్యంతో నీటి సరఫరాకు అంతరాయం కలగడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి పరిష్కారానికి అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకుంటే సుమారు 80 వేలకు పైగా ఉన్న పట్టణ ప్రజలకు ఈ సీజన్‌లో తాగునీటి కోసం ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. ఇటీవల మిషన్ భగీరథ పథకం పాలేరు జలాశయం వద్ద నిర్వహణ పనుల నేపథ్యంలో సుమారు 5 రోజులు నీటి సరఫరా నిలిచిపోయింది. నర్సంపేట నియోజకవర్గానికి వెళ్లే పైప్‌లైన్‌కు అనుసంధానంగా ట్యాపింగ్ పాయింట్స్‌ను గ్రిడ్ అధికారులు ఒక్కొక్కటిగా మూసివేస్తున్నారు. 24 ట్యాపింగ్ పాయింట్లు ఉండగా పైపులైన్ నిర్మాణ పనులు పూర్తికాక ముందే 15 వరకు ట్యాపింగ్ పాయింట్లు మూసివేశారు. దీంతో మహబూబాబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోతోంది. బాబునాయక్ తండాలో ఇటీవల పాయింట్‌ను మూసి వేయడంతో తీవ్రమైన నీటి సమస్య ఏర్పడింది. మూడు రోజుల కిందట పాలేరు నుంచి వచ్చే పైపులైన్ పగిలిపోవడంతో పట్టణానికి నీటి సరఫరా నిలిచిపోయింది. స్థానికంగా అక్కడక్కడ పైపులు లీకేజీ కావడం, కొన్ని చోట్ల పగిలిపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాత బజార్‌లోని కొన్ని ప్రాంతాలకే తాగునీరు సరఫరా అవుతోంది. కొత్త బజార్‌లోనూ అదే పరిస్థితి నెలకొంది. పురపాలక సంఘం అధికారులు తాత్కాలికంగా కొన్ని వార్డుల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఒక ఇంటికి పది బిందెలకు మించి నీటిని పోయడం లేదు. దీంతో నీటి సమస్య తీవ్రంగా మారింది.

# పసిమొగ్గలు విక్రయానికా?

ఖమ్మం : డబ్బుకు లోకం దాసోహం అన్నతీరుగా తమ బిడ్డలనూ విక్రయిస్తున్న తీరు అక్కడక్కడా చోటుచేసుకుంటూ సమాజ దుస్థితిని ప్రశ్నిస్తోంది. చిన్నపిల్లల విక్రయాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఎంతో కృషి చేస్తున్నా, పేగు బంధాన్ని గంటల వ్యవధిలో అమ్మకానికి పెడుతున్న ఘటనలు ఇప్పటికీ పలుచోట్ల వెలుగు చూస్తూనే ఉన్నాయి. మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఎక్కువ మంది పిల్లలున్న వారిని, నిరుపేదలైన వారిని లక్ష్యం చేసుకోని వారికి డబ్బును ఆశగా చూపి ముక్కుపచ్చలారని పసిపిల్లలను విక్రయానికి పెడుతున్నారు. తెలిసీతెలియని వయసులో పెళ్లి కాకుండా గర్భం దాల్చి విక్రయించేవారు కొందరైతే, పేదరికంతో విక్రయించేవారు మరికొందరు. కారణం ఏదైనా దళారులు అందినకాడికి దండుకుంటుండగా, ఇటు చిన్నారులు కన్నవారికి దూరం అవుతున్నారు. ఈ ఘటనలు వెలుగులోకి వస్తే చిన్నారులను కొనుగోలు చేసిన వారు పోలీసు కేసుల పాలవుతున్నారు.

ఇటీవలి కాలంలో చంద్రుగొండ, పాల్వంచ, దుమ్ముగూడెం మండలాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆయా ఘటనలు వెలుగులోకి రావడంతో ప్రభుత్వ అధికారులు వారిని తిరిగి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ములకలపల్లి మండలంలో మూడు నెలల కిందట ఓ బాలుడిని కొత్తగూడెంకు చెందిన వ్యక్తులకు విక్రయించారు. ఆ సమాచారం తెలిసి అధికారులు బాలుడిని తిరిగి తీసుకురాగా తల్లిదండ్రులు తాము పెంచుకోలేమనడంతో శిశు సంరక్షణ కేంద్రానికి తరలించి అక్కడే పెంచుతున్నారు. ములకలపల్లి మండలానికి చెందిన మరో కుటుంబం పాల్వంచలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పురుడుపోసుకున్న గంటల వ్యవధిలోనే బాలుడిని విక్రయించాగా, సమాచారం తెలుసుకున్న చైల్డ్‌లైన్ 1098 సిబ్బంది, పోలీసుల సహకారంతో శుక్రవారం వేకువజామున బాబును తిరిగి తల్లి వద్దకు చేర్చారు.

గడిచిన రెండేళ్ల వ్యవధిలో వివిధ కారణలతో విక్రయించిన, వీధుల్లో వదిలేసిన 31 మంది చిన్నారులను చైల్డ్‌లైన్ 1098, ఐసీడిఎస్, పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించి పిల్లలను స్వాధీనపరుచుకొని సీడబ్ల్యూసీ ఎదుట హాజరుపరిచి, బాలల సంరక్షణ కేంద్రాలకు తరలించారు. ఇప్పటి వరకు ఇలా తరలించిన వారిలో 16 మందిని చట్టప్రకారం దత్తత ఇవ్వగా, ఐదుగురిని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి తిరిగి వారికే అప్పగించారు. మరో 10 మంది ఎస్ఏఏ 'సా' పర్యవేక్షణలో ఉన్నారు. చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం- రాజ్‌కుమార్, చైల్డ్‌లైన్ 1098 జిల్లా సమన్వయకర్తపిల్లలను విక్రయించడం, వారితో పనుల చేయించడం చట్ట ప్రకారం నేరం. పిల్లల క్రయవిక్రయాలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. పిల్లలను పోషించే ఆర్థిక స్థోమత లేనివారు చైల్డ్‌లైన్ 1098 సమాచారమిస్తే బాలల సంరక్షణ కేంద్రాలకు తరలించి, వారి సంరక్షకు చర్యలు తీసుకుంటాం. చట్ట ప్రకారం దత్తత తీసుకోవాలి- అంబేద్కర్, జిల్లా సీడబ్ల్యూసీ సభ్యులుపిల్లలు లేనివారు చట్ట ప్రకారం దత్తత తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (సీఏఆర్ఏ-కారా) ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. పిల్లలు కావలసిన వారు చైల్డ్‌లైన్ 1098, ఐసీడీఎస్ సిబ్బంది లేదా 'సా' అధికారులను సంప్రదిస్తే చట్ట ప్రకారం దత్తత తీసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటారు.

# రెండేళ్లు 7.5 శాతం వడ్డీ!

ఖమ్మం : మహిళలు, బాలికలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో వినూత్న పొదుపు పథకానికి శ్రీకారం చుట్టింది. మహిళా సమ్మాన్ పొదుపు ఖాతాలను ప్రవేశపెట్టింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఏడాది ఫిబ్రవరిలో 2023-24 బడ్జెట్‌లో దీన్ని ప్రకటించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ఇది అమలవుతోంది. ఇది ఏక సమయం పొదుపు పథకం. అధిక శాతం వడ్డీకి ఇప్పటివరకు అయిదు, పది సంవత్సరాల సుదీర్ఘ కాలానికి మించిన పొదుపు పథకాలే ఉన్నాయి. కానీ రెండేళ్లకే 7.5 శాతం వడ్డీని ఇవ్వగలిగిన ఏకైక పథకం ఇదొక్కటే. 2025, మార్చి 31వరకు మాత్రమే ఇది అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం పోస్టాఫీసుల్లో మాత్రమే దీన్ని అమలు చేస్తున్నారు.

పరిపక్వత: ఖాతా ప్రారంభించిన తేదీ నుంచి రెండేళ్లు పూర్తయిన తరవాత పూర్తి మెచ్యూరిటీ లభిస్తుంది. అప్పుడు 7.5 శాతం వడ్డీతో రూ.వెయ్యి పెట్టుబడికి రూ.1,160, రూ.10,000 పెట్టుబడికి రూ.11,602, రూ.50,000 పెట్టుబడికి రూ.58,011, రూ.1,00,000 పెట్టుబడికి 1,16,022, రూ.2,00,000 పెట్టుబడికి రూ.2,32,044 మెచ్యూరిటీ మొత్తంగా ఇస్తారు.

"మహిళలకు ఎంతో ఉపయోగపడే పథకం. అధిక శాతం వడ్డీకి దీర్ఘకాల పథకాలే ఉన్నాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి."

వి.సురేందర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్టాఫీస్, భద్రాచలం

ఎవరు, ఎలా ప్రారంభించాలి

మహిళ అయితే సొంతంగా, బాలిక అయితే ఆమె తరపున సంరక్షకుడు ఖాతాను ప్రారంభించే అవకాశం ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక ఫారం ఉంటుంది. ఆధార్ కార్డు/ పాన్ కార్డులు ఉండాలి. కొత్త ఖాతాదారుడు అయితే నగదు మొత్తం లేదా చెక్కుతోపాటు పే ఇన్ స్లిప్‌ను కూడా పోస్టాఫీసులో సమర్పించాలి.

ఎంత డిపాజిట్ చేయాలి?

కనిష్ఠంగా రూ.వెయ్యి, గరిష్ఠంగా రూ.2 లక్షలతో నిబంధనలను అనుసరించి ఈ ఖాతాలను ప్రారంభించాలి. ఒకరు ఒకటికి మించి ఎన్ని ఖాతాలను అయినా ప్రారంభించవచ్చు. అయితే ఒక ఖాతాకు మరో ఖాతాకు మధ్య మూడు నెలల వ్యవధి ఉండాలి. సంయుక్త ఖాతాలకు అవకాశం లేదు.

వడ్డీ ఎంత?

సంవత్సరానికి 7.5 శాతం వడ్డీ ఉంటుంది. మూడు నెలలకోసారి వడ్డీని లెక్కించి ఖాతాలో జమ చేస్తారు. ఖాతా మూసి వేసే సమయంలో వడ్డీని చెల్లిస్తారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రారంభించినా లేదా డిపాజిట్ చేసినా పీవోఎస్‌బీ వడ్డీ రేటు మాత్రమే వర్తిస్తుంది.

ఉపసంహరణ

పోస్టాఫీసుల్లోని కొన్ని ఖాతాల్లో ప్రీ మెచ్యూర్ ఉపసంహరణ అవకాశం లేదు. అయితే ఈ ఖాతాలకు ప్రీ మెచ్యూర్ ఉపసంహరణ అవకాశం ఉంది. ఖాతా ప్రారంభించిన తేదీ నుంచి ఏడాది తర్వాత 40 శాతం ప్రీ మెచ్యూర్ మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చు. ఖాతాదారుడు లేదా సంరక్షకుడు మరణించినా ఇతర ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్నా అత్యవసరంగా ఉపసంహరించుకోవచ్చు. తెరిచిన ఆరు నెలల తరవాత కూడా దీన్ని ఉపసంహరించుకోవచ్చు. అయితే వడ్డీ శాతంలో 2శాతం తక్కువ చేసి చెల్లిస్తారు. అంటే 7.5 వడ్డీ శాతంతో కాకుండా 2 శాతం తగ్గించి 5.5 శాతం వడ్డీ శాతంతో మెచ్యూరిటీ మొత్తం చెల్లించడం జరుగుతుంది.

# ధాన్యం నిల్వకు చోటేది?



ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో యాసంగి ధాన్యం సేకరణ అధికార యంత్రాంగానికి సవాల్‌గా మారుతోంది. గత రెండు సీజన్లలో వచ్చిన ధాన్యంతోనే మిల్లుల్లో నిల్వలు పేరుకుపోయాయి. ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేద్దామంటే గిడ్డంగుల్లోనూ ఖాళీ లేదని అధికారులు వాపోతున్నారు. అందుకే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు.

మిల్లర్లు ససేమిరా..

ఖమ్మం జిల్లాలో ఇప్పటికే అక్కడక్కడా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. 4,34,018 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 230 కేంద్రాల ద్వారా సేకరించాలని నిర్ణయించారు. భద్రాద్రి జిల్లాలో వచ్చే వారంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు. 1,56,040 మె.ట. ధాన్యాన్ని 134 కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని భావిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 65 మిల్లులు ఉండగా ఇప్పటికే 2 లక్షల మె.ట. ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. మిల్లర్లు ధాన్యాన్ని మరపట్టి బియ్యంగా మార్చి రవాణా చేస్తున్నా.. గిడ్డంగుల్లో సామర్థ్యం లేక దిగుమతి చేసుకునేందుకు ఎఫ్‌సీఐ ససేమిరా అంటోంది. ఉభయ జిల్లాల నుంచి ఎఫ్‌సీఐ గోదాములకు రోజుకు 150 లారీల బియ్యం వస్తుంటే.. 50 లారీల సరకును దిగుమతి చేసుకోవడమే గగనంగా మారింది. ఒక్కో లారీ కనీసం వారంపాటు ఎఫ్‌సీఐ గోదాముల వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. అందుకే ఈసారి అసలు ధాన్యమే తీసుకోలేమని మిల్లర్లు ప్రభుత్వానికి తేల్చిచెప్పారు.

అధికారుల మల్లగుల్లాలు..

ఖమ్మం జిల్లాలో పౌరసరఫరాల సంస్థ పరిధిలో 12 గిడ్డంగులున్నాయి. వీటిలో 78,389 మె.ట. నిల్వ సామర్థ్యం ఉన్నా.. అందులో బియ్యం, గోనెసంచులు నిండిపోయాయి. మార్కెట్ యార్డుల పరిధిలోని 15 గిడ్డంగుల్లో 60వేల మె.ట. సామర్థ్యానికి గాను 20వేల మె.ట. నిల్వ చేసే ఖాళీ స్థలం మాత్రమే ఉంది. భద్రాద్రి జిల్లాలోని 19 మార్కెట్ కమిటీ గోదాముల్లో 60వేల మె.ట. నిల్వ సామర్థ్యానికి ఎక్కడా ఖాళీ లేదు. అందుకే యాసంగి ధాన్యాన్ని రైతు వేదికలు, ఫంక్షన్‌హాల్స్, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, ఖాళీ భవనాల్లో నిల్వ చేయాలని అధికారులు యోచిస్తున్నారు. కొవిడ్ సమయంలో రవాణా సౌకర్యం లేక ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు ఫంక్షన్‌హాల్స్‌లో మొక్కజొన్నను నిల్వచేసి మార్క్‌ఫెడ్ నష్టాలపాలైంది. ఈసారి ధాన్యం నిల్వచేస్తే.. ఎలాంటి పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందోనని అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

"ఈసారి ధాన్యం సేకరణలో అడ్డంకులను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాం. మిల్లర్లకు ఇవ్వడంతోపాటు ఇతర జిల్లాల మిల్లులకు తరలించేందుకు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలి.""గత రెండు సీజన్లలో వచ్చిన ధాన్యంలో 2 లక్షల మెట్రిక్ టన్నులు మిల్లుల్లో నిల్వ ఉన్నాయి. ఎఫ్‌సీఐ సకాలంలో బియ్యం తీసుకోనందున మా దగ్గర నిల్వలు పేరుకుపోయాయి. కొత్తగా ఈ యాసంగి ధాన్యం తీసుకుని నిల్వ చేసే పరిస్థితి లేదు."

# మందులిచ్చేవారేరి?



ఖమ్మం : సర్వజన ఆస్పత్రిలో ఫార్మసిస్టుల కొరత నెలకొంది. ఆసుపత్రిపై నమ్మకం పెరిగి వేలాది మంది రోగులు చికిత్స కోసం వస్తున్నారు. వైద్య సేవలు పొందిన తర్వాత ఔషధాల కోసం ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం అన్ని రకాల మందులు సరఫరా చేస్తున్నా... వాటిని పంపిణీ చేసేవారు కరవయ్యారు. అవసరాలకు తగిన సంఖ్యలో ఫార్మసిస్టులు లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఉచితంగా అందాల్సిన మందులను జనరిక్, అమృత్ కేంద్రాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

ఆస్పత్రిలో ఒక ప్రధాన, రెండు ఉప స్టోర్‌లు, రెండు డిస్పెన్సరీలు ఉన్నాయి. ప్రస్తుతం ఎనిమిది మంది ఫార్మసిస్టులు ఉన్నారు. స్టాటిస్టిక్స్ ఆఫీసర్ లేకపోవడంతో అందులో ఒకరు సెన్సెస్ విధులు నిర్వహిస్తున్నారు. నిత్యం ఒకరిద్దరు సెలవులో ఉంటున్నారు. మిగిలిన వారు మూడు షిఫ్టుల్లో పని చేయాలి. ఇప్పుడున్న అవసరాలకు వీరు సరిపోవడం లేదు.

అన్ని విభాగాలకు సంబంధించి ప్రతీ రోజు 1500 నుంచి 1900 వరకు ఓపీ నమోదవుతుంది.

రోగులకు అవసరమైన 360 రకాలకు పైగా ఔషధాలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోంది.

సాధారణ ఆస్పత్రికి వచ్చే రోగులతో ఉదయం 9 గంటల నుంచే క్యాజువాలిటీ సమీపంలోని డిస్పెన్సరీ రద్దీగా ఉంటుంది. మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో డిస్పెన్సరీ వద్దా ఇదే పరిస్థితి.

ఈ సమయంలో ఒక్కోచోట నలుగురు ఫార్మసిస్టులుంటే తప్ప రోగులకు సకాలంలో మందులు అందవు.

ఆస్పత్రిలో దాదాపు 40 ఇన్‌పేషంట్ వార్డులు ఉన్నాయి. ప్రతిరోజు డిశ్చార్జి అయ్యే రోగులు 50 మందికి పైగానే ఉంటున్నారు. వీరందరికీ ఇళ్లకు వెళ్లే సమయంలో డిస్పెన్సరీల్లోనే నెలకు సరిపడా మందులు ఇవ్వాలి.

కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, పాలియేటివ్, క్షయ విభాగాల వద్ద ఔషధ కేంద్రాలు లేకపోవడంతో రోగులు క్యాజువాలిటీ డిస్పెన్సరీకి వస్తున్నారు.

సిబ్బంది కొరత కారణంగా మూడు షిఫ్టులు ఔషధాలు పంపిణీ సాధ్యపడటం లేదు. నానాటికి ఆస్పత్రిలో విభాగాల విస్తరణ జరుగుతున్నా ఆ స్థాయిలో ఔషధ కేంద్రాల ఏర్పాటు, ఫార్మసిస్టుల నియామకం జరగకపోవడంతో రోగులు అసౌకర్యానికి గురవుతున్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేస్తాం

డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, మెడికల్ సూపరింటెండెంట్

ఫార్మసిస్టుల కొరత వాస్తవమే. ఉన్నతాధికారుల అనుమతితో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తాం. రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

# శస్త్రచికిత్సలేవి?

ఖమ్మం : నేత్ర సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారిని ఆదుకొనేందుకు 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. జనవరి 19న రెండో విడత ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 20 వరకు కొనసాగుతుంది. ప్రతి పంచాయతీలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సమస్యలున్న వారికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి రీడింగ్ అద్దాలను శిబిరాల్లోనే అందజేస్తున్నారు. దూరం చూపు లోపాలున్న బాధితులకు ఆర్డర్ పెట్టి వచ్చిన తర్వాత అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. కంటి శస్త్రచికిత్సలు అవసరం ఉన్నవారి వివరాలను మాత్రం వైద్య బృందాలు బయటకు వెల్లడించడం లేదు. ఈ కార్యక్రమం ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా కంటి శస్త్రచికిత్సల ఊసే లేదని బాధితులు వాపోతున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 480 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో ఇప్పటి వరకు 3,27,186 మందికి కంటి పరీక్షలు చేశారు.

పరీక్షలు చేయించుకున్న వారిలో కొందరికి శుక్లాలు తదితర శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. ఈ బాధితులు సొంతంగా ప్రైవేటుగా శస్త్రచికిత్సలు చేయించుకోవాలా.. లేక ప్రభుత్వమే చేయిస్తుందా అన్న అంశంపై స్పష్టత లేదు. అంతేగాక ప్రిస్క్రిప్షన్ (దూరపు చూపు) అద్దాలు అవసరమైన వారికి వాటిని అందివ్వడంలో జాప్యం చోటుచేసుకుంటోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్గదర్శకాలు రాలేదు

శిరీష, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణికంటి వెలుగు కార్యక్రమంలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో కంటి శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి వారి వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తున్నాము. శస్త్రచికిత్సలు ప్రభుత్వమే చేయిస్తుంది. ఈ అంశంపై ఇంకా ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపడతాం.

# వాహనాలు సిద్ధం... సిబ్బంది కనం..!

ఖమ్మం : ఉమ్మడి జిల్లా ఆబ్కారీ శాఖ కోసం ప్రభుత్వం రెండు సంచార తనిఖీ బృందాల వ్యవస్థను మంజూరు చేసింది. ఈ రెండు బృందాలు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల సరిహద్దుల్లో తిరుగుతూ నాటుసారా, గంజాయి పట్టుకొని అక్రమార్కుల పని పట్టాలి. ఇంత వరకు బాగానే ఉన్నా మంజూరు వచ్చి ఏడాది అవుతోంది. మొబైల్ పార్టీ జాడలేదు. కమిషనర్ కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు రావాలని ఇక్కడి అధికారులు ఏడాదిగా ఎదురుచూస్తున్నారు. ఇలా కాలయాపనలోనే మొబైల్ పార్టీలు ఊగిసలాడుతున్నాయి. ఇప్పటికే శాఖలో వాహనాలు అద్దెకు ఉంచిన యజమానులు మొబైల్ పార్టీల కోసం వాహనాలు మేమే సిద్ధం చేస్తామని ముందుకు వచ్చి ఏకంగా



నగరంలోని ఒకటో పట్టణ స్టేషన్లో నిలిపి ఉంచారు. ఆదేశాలు రావడమే తరువాయి అంటూ ఉత్సాహంగా వాహనాలను సిద్ధం చేసుకున్న వారు ఇప్పుడు తెగ బాధపడిపోతున్నారు. రోజూ రావడం వాహనాన్ని స్టార్ట్ చేసి తుడుచుకొని వెళ్తున్నారు. మొబైల్ పార్టీల ఏర్పాటులో జరుగుతున్న జాప్యాన్ని ఉప కమిషనర్ జనార్దన్‌రెడ్డి దృష్టికి తేగా మంజూరు వచ్చిన మాట వాస్తవమేనని, అందుకు తగిన నియామక ఆదేశాలు రావాలన్నారు. వాటి కోసం ఎదురు చూస్తున్నామని రాగానే మొబైల్ పార్టీలను రంగంలోకి దింపుతామన్నారు.

# సీతారామా వారధి లేదు సుమా!

ఖమ్మం : జూలూరుపాడు మండలంలో సీతారామ ప్రాజెక్టు కాలువ 8వ ప్యాకేజీ పరిధిలోని పలు గిరిజన గ్రామాల ప్రజలు వంతెనలు లేక ఇబ్బంది పడుతున్నారు. కాలువ తవ్వకం తర్వాత గ్రామాల మధ్య రాకపోకలకు, రైతులు పొలాలకు వెళ్లేందుకు వంతెనలు నిర్మించాలి. నల్లబండబోడు నుంచి పాపకొల్లు అటవీ ప్రాంతం వరకు సుమారు 12 గ్రామాల ప్రజలకు రవాణా, ప్రయాణ సౌకర్యం ఇబ్బందికరంగా మారింది. ఏడు వంతెనలు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు మూడుచోట్ల పనులు కొనసాగుతున్నాయి.

ప్రధాన కాలువపై వంతెనలు లేక పలు గ్రామాల ప్రజల అవస్థలు చంద్రుగొండ మండలం కర్సలబోడు- జూలూరుపాడు మండలం నల్లబండ మధ్య వంతెన నిర్మించకపోవటంతో ఆ రెండు గ్రామాల ప్రజలు వర్షాకాలంలో పడరాని పాట్లు పడుతున్నారు.

నల్లబండబోడు నుంచి జూలూరుపాడు మధ్యలో ఉన్న కాలువపై వంతెన లేకపోవటంతో గతేడాది వరద మొత్తం గ్రామం వైపు మళ్లింది. సూరారం- వీరభద్రాపురం మధ్య నిర్మాణం నత్తనడకన సాగుతోంది. తాత్కాలిక రహదారి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలం కాలువ నీటితో నిండి మట్టి రహదారిపైకి వరద వస్తోంది. రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. 5కి.మీ. దూరంలోని మండల కేంద్రానికి రావడానికి నానా పాట్లు పడుతున్నారు. రామచంద్రాపురం వద్ద రైతులు కాలువ నుంచే పొలాలకు వెళ్లాలి. తాత్కాలికంగా మట్టిపోసి అడ్డుకట్ట వేశారు. గతేడాది మేకల కాపరి ఈ కాలువలోకి దిగి మృత్యువాత పడ్డాడు. ఇంజనీరింగ్ అధికారులు వచ్చి ఇక్కడ వంతెన నిర్మిస్తామని చెప్పినా కార్యరూపం దాల్చనేలేదు.

జూలూరుపాడు- ఏన్కూరు మండలం ఒంటిగుడిసె రహదారిలో, వినోభానగర్ సమీపంలోని తల్లాడ- కొత్తగూడెం ప్రధాన రహదారిపై వంతెనలు ఏర్పాటు చేయాలి.



కొత్తూరు- వినోభానగర్, పాపకొల్లు, రాజారావుపేట అటవీ ప్రాంత సమీపాన పొలాలకు వెళ్లేందుకు, ఏన్కూరు మండలం రేపల్లెవాడ- జూలూరుపాడు మండలం రాజారావుపేట మధ్య రహదారిపైనా బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలి. సీతారామ ప్రాజెక్టు కాలువ మండలంలో సుమారు 18 కి.మీ. పొడవున ఉంది. అయిదేళ్లయినా ఇంతవరకు వంతెనల నిర్మాణం పూర్తికాలేదు.

పిల్లర్ల స్థాయిలోనే బూర్గంపాడు మండలంలోని కృష్ణసాగర్, చెరువు సింగారం, నకిరిపేట, టేకులచెరువు, జింకలగూడెం గ్రామాల మీదుగా సీతారామ ప్రధాన కాలువ సాగుతోంది. నకిరిపేట సమీపంలో కాలువ మీద వంతెన లేకపోవడంతో రైతులు, గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిర్మాణం ప్రారంభించినా అది పిల్లర్ల స్థాయిలోనే ఆగిపోయింది. దీంతో కాలువ అవతల పొలాలున్న రైతులకు 2 కి.మీ. మరో వంతెన ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం లక్ష్మీపురం వచ్చే వారితోపాటు కాలువ అవతల ఉన్న ఐటీసీ ప్లాంటేషన్ కార్మికులూ సమస్య ఎదుర్కొంటున్నారు. కొందరు నీళ్లు తక్కువగా ఉన్న సమయంలో కాలువలో నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు. త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇలాగైతే వెళ్లేదెలా..సీతారామ ప్రధాన కాలువపై వంతెన వద్ద అమీర్దా- కట్టంవారిగూడెం రహదారి ప్రమాదభరితంగా ఉంది. మంగలిచెలక, చంద్రలబోడు, బండ్ల సిరిగుట్ట దేవాలయాలకు ఇదే దగ్గరి దారి. అమీర్దా నుంచి ఉన్న ఈ రహదారికి అడ్డంగా ప్రధాన కాలువ లోతుగా తవ్వారు. కాలువపై ఓ వంతెన కట్టారు. ఈ వంతెన వద్దకు చేరాలన్నా, చేరాక అవతలి ఒడ్డుకు వెళ్లాలన్నా తిప్పలు తప్పటం లేదు. ఎత్తుగా ఉన్న రహదారి నుంచి ఏటవాలుగా దిగి వంతెన వద్దకు రావాల్సి వస్తోంది. దీనిపై నుంచి ప్రధాన కాలువ దాటి ఆవలి వైపు వెళ్లగానే అక్కడా కట్టంవారిగూడెం రహదారి చాలా ఎత్తులో నిట్టనిలువుగా ఉంటుంది. చాలా అప్రమత్తంగా రాకపోకలు సాగిస్తున్నా అనేక సందర్భాల్లో ఈ ప్రాంతంలో ట్రాక్టర్లు తల్లకిందులైన సంఘటనలున్నాయి. ఏదో మట్టి పోసి కొంత ఏటవాలుగా చేశారు. అయినా లాభం లేదు. వాహనాలు ప్రయాణించేందుకు వీలుగా రహదారిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# అనుసంధానం చేసుకోండి.. సాయం పొందండి

ఆదిలాబాద్ : వ్యవసాయ పనుల అవసరాల కోసం కేంద్రం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయాలంటే ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని తాజాగా నిబంధనలు జారీ చేసింది. ప్రతి రైతుకు రూ.2 వేల చొప్పున ఏడాదిలో మూడు సార్లు మొత్తం రూ.6 వేలు ఖాతాల్లో జమ చేస్తోంది. ఇప్పటి వరకు పది విడతల్లో సొమ్మును అందించారు. పథకంలో ఎలాంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా ఉండేందుకు గతంలో కేవైసీ చేసుకున్న లబ్ధిదారులు తప్పనిసరిగా మరోసారి ఈ-కేవైసీని నమోదు చేసుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తి చేసుకున్న వారికే సొమ్ము వారి ఖాతాల్లో జమ కానుందని అధికారులు పేర్కొంటున్నారు.

చేసుకోవడం ఇలా.. ఈ-కేవైసీ ధ్రువీకరణను రైతులు పీఎం కిసాన్ పోర్టల్ యాప్ ద్వారా, మీ-సేవా, ఈ-సేవా కేంద్రాల్లో మండల వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేసుకోవచ్చు. స్మార్టు ఫోన్ ఉన్నవారు %www.pmkisan.gov.in% లింక్‌ను తెరవగానే అందులో ఈ-కేవైసీ అప్‌డేట్ వస్తుంది. దానిపై క్లిక్ చేసి ఆధార్ నంబర్‌ను




నమోదు చేయాలి. అప్పుడు ఆధార్ లింకుతో ఉన్న చరవాణికి ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేసి గేట్ పీఎం కిసాన్ ఓటీపీ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. చరవాణికి వచ్చిన ఓటీపీని అక్కడ ఎంటర్ చేసి సబ్‌మిట్‌పై క్లిక్ చేస్తే ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తవుతుంది.

అనర్హులకు దక్కకుండా..కేంద్ర ప్రభుత్వం దాదాపు పది విడతలుగా ఎలాంటి షరతులు లేకుండా రైతులకు సాయం అందిస్తోంది. తాజాగా బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేసింది. అనర్హులు, తప్పుడు ఖాతాలతో నగదు పొందుతున్న వారి నుంచి అర్హులైన వారికే వీటిని అందించేలా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి ఆధార్ అనుసంధాన ప్రక్రియను అమల్లోకి తెచ్చింది.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : - కల్పన, జిల్లా వ్యవసాయాధికారి, మంచిర్యాల

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 11వ విడత రైతుల ఖాతాల్లో నేరుగా జమ కావాలంటే ఈ-కేవైసీ నమోదును తప్పనిసరిగా చేసుకోవాలి. మే 31 వరకు గడువుంది. ఆధార్, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాస్ బుక్‌లతో రైతులు ఆన్‌లైన్ కేంద్రాల్లో, మీ సేవా, ఈ సేవా, బ్యాంకు లోనూ నమోదు చేసుకోవచ్చు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ఉమ్మడి జిల్లాలో ఖాతాల వివరాలు

మొత్తం రైతు ఖాతాలు 5,47,259

అనుసంధానించినవి 1,74,612

అనుసంధానం కానివి 3,72,647

## బాలికా విద్యకు భరోసా

మంచిర్యాల : బాలికల విద్యాభ్యాసానికి కస్తూర్బాగాంధీ విద్యాలయాలు వేదికగా నిలుస్తున్నాయి. కేజీబీవీల్లో కార్పొరేట్ స్థాయి పాఠశాలలకు మించిన వసతులు ప్రభుత్వం కల్పిస్తోంది. పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. అయితే పదోతరగతి పూర్తయి ఇంటర్ విద్యలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఊరట లభించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి జిల్లాలో కొత్తగా రెండింటిలో ఇంటర్‌విద్యను ప్రారంభిస్తూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు రాబోయే విద్యాసంవత్సరానికి గానూ ప్రవేశాలకు అవకాశం కల్పించింది. జిల్లా వ్యాప్తంగా 18 కస్తూర్బా విద్యాలయాలు ఉండగా.. గత విద్యాసంవత్సరం వరకు ఏడు విద్యాలయాల్లో ఇంటర్ బోధనలు సైతం అందించారు. మారుమూల ప్రాంతాల్లోని బాలికలకు స్థానికంగా జూనియర్ విద్య అందుబాటులో లేక పట్టణాలకు వెళ్లి చదవలేక పది పూర్తిచేసి మానేస్తున్నారనే ఉద్దేశంతో అవసరమున్న చోట కేజీబీవీలను ఏటా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. ఈ సంవత్సరం బెల్లంపల్లి, నెన్నెల విద్యాలయాలను ఉన్నతీకరించి ఇంటర్ బోధనలకు అనుమతి ఇచ్చారు. బెల్లంపల్లిలో బైపీసీ, ఎంపీసీ, నెన్నెలలో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో కోర్సులో 40 మందికి చొప్పున బాలికలకు ప్రవేశాలు కల్పిస్తారు. ఈ సంవత్సరం నుంచి ఇంటర్ పాఠాలు ప్రారంభించాలని ఆదేశించడంతో సంబంధిత అధికారులు వసతులు, ప్రవేశాలకు సిద్ధమవుతున్నారు.

## జరిమానాల బాదుడు..

ఆసిఫాబాద్ : ఓ వైపు ఇంధన ధరలు.. మరోవైపు ట్రాఫిక్ చలానాలు వాహనదారుల జేబులను గుల్ల చేస్తున్నాయి. ఆసిఫాబాద్ పట్టణంలోని మార్కెట్లో పార్కింగ్ స్థలం లేదు.. దీంతో వాహనదారులు రోడ్డు పక్కన వాహనాలు నిలుపుతున్నారు. ఇదే అదనుగా ఫొటో తీసి 'నో పార్కింగ్' చలానా విధిస్తున్నారు. పాల ప్యాకెట్ కోసం కిరాణా దుకాణం ముందు బండి నిలిపినా 'క్లిక్' మనిపిస్తున్నారు. దీంతో బండెక్కి రోడ్డు మీదకి ద్విచక్ర వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని సందర్భాల్లో చిన్న తప్పులకే రూ.వేలల్లో జరిమానాలు విధిస్తుండ టంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వాహనదారులు లబోదిబో మంటున్నారు. ఆన్‌లైన్ చలానాలు నేరుగా ఇంటికి వస్తుండటంతో ఏం చేయలేని పరిస్థితి నెలకొంటుంది. కొందరు ధైర్యం చేసి అడుగుతు న్నా.. చాలామంది ఎవరిని అడగాలో తెలియక సతమతమవుతున్నారు.

సవరణకు అవకాశం ఉన్నా అమలు గగనం..

లైసెన్స్ లేదు, రాంగ్ ప్లేస్‌లో పార్కింగ్ చేశారంటూ జరిమానా విధిస్తూ సందేశం వచ్చిందనుకుందాం. సదరు వాహన యజమాని సంబంధిత స్టేషన్‌లో సంప్రదించి సరైన పత్రాలు చూపిస్తే.. 24 గంటల్లోపు హైదరాబాద్ ట్రాఫిక్ కార్యాలయానికి పంపించి సవరణ చేయించే వీలుంటుంది. కానీ ఇది ఎక్కడా అమలు చేయడం లేదు.నో పార్కింగ్ పేరుతో..జిల్లా కేంద్రంలో పార్కింగ్ సమస్య వెంటాడుతో ంది. ఎక్కడ వాహనాలు నిలపాలి, ఎక్కడ నిలపకూడదో తెలియక తికమక పడాల్సి వస్తుంది. వస్తువులు కొనుగోలు కోసం రోడ్డుపక్కన దుకాణాల ముందు వాహనాలు ఆపినా.. పోలీసుల కంట పడితే కొందరు టక్కుమని ఫొటో తీసి జరిమానా విధిస్తున్నారు. పలానాచోట వాహనాలు నిలపరాదని నామఫలకాలు ఏర్పాటు చేసినా లేదా ఏదైనా హద్దు నిర్ణయించినా బాగుంటుంది. అవి లేక కొన్ని సందర్భాల్లో జరిమానాలకు గురి కావాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. అయితే ప్రభుత్వం నిర్దేశించే టార్గెట్ల కోసం పోలీసులు విస్తృతంగా తనిఖీలు, జరిమానాలు విధిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

# ఏమార్చి.. ఏదో మార్చి



ఆదిలాబాద్ : ఆదిలాబాద్ పట్టణ బృహత్ ప్రణాళిక రూపకల్పనపై అనుమానాలు ఇంకా పెరుగుతూనే ఉన్నాయి. మున్సిపాల్టీలో రాబోయే 50ఏళ్లను దృష్టిలో ఉంచుకొని తయారు చేయనున్న ఈ మాస్టర్ ప్లాన్‌పై తూతూమంత్రంగా సమాచారం ఇచ్చి ఆమోదించడంపై నిరసన వ్యక్తమవుతోంది. కౌన్సిలర్లు సైతం పెదవి విరుస్తున్నారు. తెరాసతో సహా ఇతర పార్టీల సభ్యులు సైతం అంతా అయోమయంగా ఉందని పేర్కొంటున్నారు.గ్రేడ్-1 మున్సిపాల్టీ ఆదిలాబాద్‌లో ప్రణాళిక అడ్డదిడ్డంగా ఉంది. 1988లో కొత్తమాస్టర్ ప్లాన్ రూపొందించినా అది అమలు చేయడం కష్టంగా మారింది. తాజాగా కేంద్రం అమల్లోకి తెచ్చిన అమృత్ పథకం కింద పట్టణంలో కొత్తగా బృహత్ ప్రణాళికను రూపొందించారు. రెండు నెలల కిందట జడ్పీహాలులో దీనిపై సమావేశం నిర్వహించి ఆ తరువాత అభ్యంతరాలు స్వీకరించారు. ఇటీవల జరిగిన పురపాలక సమావేశంలో మార్పులు చేర్పులపై సభ్యులకు పూర్తి వివరాలు ఇవ్వకుండానే ఆమోదం తీసుకొని మమ అనిపించారు.

అంతా అయోమయం

వాస్తవానికి పాత మాస్టర్ ప్లాన్‌లో ఉన్నదేంటి? కొత్తగా ఏం మార్పులు చేశారు అనే పూర్తి వివరాలు సభ్యులకు తెలపాలి. ఇంతకుముందు ఉన్న పారిశ్రామిక ప్రాంతంలో ఎక్కడెక్కడ కుదించారు? కొత్తగా ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు? విలీనమైన గ్రామాల్లో వ్యవసాయ భూములను అలాగే ఉంచుతున్నారా? నివాసిత ప్రాంతంగా మారుస్తున్నారా? కొత్త రహదారులు ఎక్కడ ప్రతిపాదించారు? ఇలాంటి అన్ని విషయాలను కూలంకషంగా వివరించాలి. దీనికి సంబంధించి వివరాలతో అజెండా ఉండాలి. అలా కాకుండా కేవలం సర్వే నెంబర్లతో ఉన్న ఒక పట్టణ చిత్రపటం కౌన్సిలర్లకు ఇచ్చారు. అందులో పారిశ్రామిక ప్రాంతం, నివాసితప్రాంతం, ట్రాన్స్‌పోర్ట్ ఏరియా తదితర ఏరియాలను సూచించినా, అవి ఏ ప్రాంతంలో వస్తాయో అనేది ఎవరికి అంతుబట్టని విధంగా సమర్పించి చేతులెత్తేశారు.

వ్యూహాత్మకంగానే..పట్టణంలో ఏ కాలనీ ఏ సర్వే నెంబరులో ఉందనేది ఎవరికి తెలియదు. చిత్ర పటంలో కాలనీ పేరురాస్తే అక్కడ చుట్టుపక్కల ఏవేమి ప్రతిపాదించారనేది స్పష్టంగా తెలుస్తుంది. ఇవన్నీ పట్టించుకోకుండా కాలనీల పేర్లతో తయారుచేయాల్సిన చిత్రపటాన్ని వ్యూహాత్మకంగా సర్వే నెంబర్లతో తయారుచేసి ఇచ్చేశారు. దీంతోనే కౌన్సిలర్లు ఈ ప్రణాళికపై విమర్శలు మొదలెట్టారు.

ఏదో గూడుపుఠాణి ఉందిచందానర్సింగ్, తెరాస కౌన్సిలర్

భావితరాలకు అవసరపడే మాస్టర్ ప్లాన్ తయారీలో ఏదో గూడుపుఠాణి ఉంది. అందుకనే తెరాస కౌన్సిలర్లలో మెజార్టీ సభ్యులకు సైతం దీనిపై సమాచారం ఇవ్వలేదు. ఇది సరైంది కాదు. పట్టణంలోని అన్ని వర్గాల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తీసుకోవాలి.

ఏముందో ఎవరికి తెలియదుఆకుల ప్రవీణ్, భాజపా ఫ్లోర్ లీడర్

కొత్త ప్రణాళికలో ఏం తయారు చేశారో ఎవరికి తెలియదు. అధికార పార్టీకి మెజార్టీ ఉండటంతో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలందరి అభిప్రాయాలు తీసుకొనే కొత్త ప్రణాళికను ఆమోదించాలి.

పాతరోడ్డు మాయంచేశారుఅంబకంటి అశోక్, కాంగ్రెస్ కౌన్సిలర్

పాత మాస్టర్ ప్లాన్‌లోని కొన్ని రహదారులను మాయం చేసినట్లు సమాచారం ఉంది. పూర్తి వివరాలు అధికారులు తెలపడం లేదు. పాతది ఎలా ఉంది? కొత్త దాంట్లో చేసిన మార్పులు ఏంటి? ఇవన్ని ప్రజలకు బహిర్గతం చేయాలి.

తుది ఆమోదం కాదుశైలజ, కమిషనర్

ఇది తుది ఆమోదం కాదు. హైదరాబాద్‌లోని డీటీసీపీ ఆమోదం కాగానే అక్కడి నుంచి వివరాలు వస్తాయి. దానికనుగుణంగా ప్రజల నుంచి అభ్యంతరాలు తీసుకుంటాం. దీనికి రెండు నెలల సమయం ఉంటుంది. అనంతరం మళ్లీ పాలకవర్గంలో ఆమోదం కోసం ఉంచుతాం.

# అధికారుల నిర్లక్ష్యం.. మందుల నిల్వే సాక్ష్యం



ఆదిలాబాద్ : రూ.లక్షల ప్రజాధనం వెచ్చించి కొనుగోలు చేసిన మందులను శిబిరాలు ఏర్పాటు చేసి వినియోగించాల్సి ఉన్నా ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వస్త్ కార్యక్రమం)అధికారులు నెలలుగా వాటిని మూలన పడేశారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిల్వ చేసిన ఈ మందుల్లో కొన్నింటికి చెదలు పట్టగా, మరి కొన్ని ఔషధాలు బూజుపడుతున్నాయి. కొన్నింటికి ఇప్పటికే ముగిసింది. వీటిని చూస్తే అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది.చిన్నారులను సంపూర్ణ ఆరోగ్యంగా ఉంచటానికి కేంద్ర ప్రభుత్వం ఆర్‌బీఎస్‌కే అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో డైస్ కేంద్రం ఏర్పాటు చేసి సేవలందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా మరో నాలుగు ఆర్‌బీఎస్‌కే బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలకు వాహన సౌకర్యం కల్పించటంతో పాటు ప్రతి బృందంలో ఒక వైద్యాధికారి, ఇతర సిబ్బందిని నియమించింది. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ సిబ్బంది శిబిరాలను ఏర్పాటు చేసి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయాలి. అస్వస్థతకు గురైన వారిని గుర్తించి మందులను అందజేసి ఆరోగ్యవంతులుగా మార్చాలి. దీర్ఘకాలిక జబ్బులున్నట్లు గుర్తిస్తే మెరుగైన చికిత్సల కోసం రిమ్స్ లేదా ఆపై సంస్థలకు రెఫర్ చేయాలి. కానీ ఆచరణలో మాత్రం ఇవేమి జరగటం లేదు. చిన్నారుల కోసం రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వం కొనుగోలు చేసిన మందులను అధికారులు నిర్లక్ష్యంగా నిల్వ చేసి చేతులు దులుపుకొంటున్నారు. అవి నిరుపయోగంగా మారి ప్రజాధనం వృథా అవుతోంది.

అస్వస్థతకు గురైన చిన్నారులకు అందించే టానిక్ (సిరప్)లు ఇవి. నెలల తరబడి డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిల్వచేసి వదిలేయటంతో వాటిపై దుమ్ము ధూళి చేరి బూజుపట్టిపోతున్నాయి. ఎంతగా అంటే కొన్నింటిపై ముద్రించిన తయారీ, గడువు మీరినట్లు తెలిపే తేదీలు సైతం చెరిగిపోయాయి.

చిందరవందరగా..ఆర్‌బీఎస్‌కే సిబ్బంది చిన్నారులకు ఎంత శ్రద్ధగా వైద్యం అందిస్తారో ఈ చిత్రాన్ని చూస్తే తెలిసిపోతుంది. వారికి అవసరమైన మందులన్నీ వైద్యాధికారి కార్యాలయంలో ఇలా చిందరవందరగా పారేయటంలో ప్రజాధనం ఎంతగా వృథా అవుతుందో తెలిసిపోతోంది.చిన్న పిల్లలు వాంతులు చేసుకుంటే నివారణకు అందించే డోంపెరడోన్ సిరప్(టానిక్) మందు ఇది. ఎప్పటి నుంచో మూలన పడేశారు. ఈ మందును వాడటానికి మరో రెండు నెలల గడువు మాత్రమే ఉంది. జులై 2022 నాటికి గడువు మీరిన మందుగా మారనుంది.

ఔషధాలకు చెదలు

ఆర్‌బీఎస్‌కే కోసం సరఫరా అయిన మందులివి. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నెలల తరబడి నిల్వ చేశారు. ఆ మందులకు చెదలు పడుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు.

గడువు మీరి ఏడు నెలలు

పిల్లలకు అందించే సీపీఎం దగ్గు మందు ఇది. గతేడాది నవంబరులోనే గడువు ముగిసింది. ప్రభుత్వం సరఫరా చేసిన ఈ మందులను కార్యాలయంలోనే వదిలేయటంతో ప్రస్తుతం ఎందుకూ పనికిరాకుండా మారాయి. 2021 నవంబరులోనే దీని గడువు ముగిసింది. దీంతో ఎంత మేర ప్రభుత్వ ధనం దుర్వినియోగం అయిందో అర్థం చేసుకోవచ్చు.

## గిడ్డంగుల అభివృద్ధికి బకాయిల అడ్డంకి

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ పరిధిలోని 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన రెండు గిడ్డంగులకు 20 మార్చి 2019 నుంచి 31 మార్చి 2022 వరకు అద్దె రూ.30,50,000 రాష్ట్ర వేర్ హౌజింగ్ కార్పొరేషన్ నుంచి మార్కెట్ కమిటీకి రావాల్సి ఉంది. ప్రతి నెల రూ.83,995 అద్దెగా నిర్ణయించారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ పరిధిలోని నార్నూర్ ఉప మార్కెట్ కమిటీ పరిధిలోని రెండు గిడ్డంగులకు రూ.17,10,962 అద్దె రావాల్సి ఉంది. కుమురం భీం జిల్లా జైనూర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలోని గిడ్డంగులకు అద్దె రావాల్సి ఉంది. ఈ కమిటీతో పాటు పూర్వ ఆదిలాబాద్ జిల్లాలోని 19 మార్కెట్ కమిటీలకు అద్దె బకాయిలు రావాల్సి ఉంది. రాష్ట్రంలోని 24 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న 350 గిడ్డంగులకు దాదాపు రూ.50 కోట్ల అద్దె బకాయిలు చెల్లించాల్సి ఉంది. రాష్ట్రంలోని 119 మార్కెట్ కమిటీల్లోని గిడ్డంగులకు అద్దె డబ్బులు మూడేళ్ల నుంచి రావడం లేదు.కేంద్ర ప్రభుత్వ సంస్థలు మార్క్‌ఫెడ్, నాఫెడ్‌ల ఆధ్వర్యంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన కందులు, శనగ, మొక్కజొన్న, జొన్నలు, వరి నిల్వ చేయడానికి రాష్ట్ర వేర్ హౌజింగ్ కార్పొరేషన్ ద్వారా ఒప్పందం చేసుకుని మార్కెట్ శాఖ గిడ్డంగులను వాడుతున్నారు. వీటిని వినియోగించుకునే మార్క్‌ఫెడ్, నాఫెడ్ సంస్థల వారు రాష్ట్ర వేర్ హౌజింగ్ కార్పొరేషన్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి అద్దె చెల్లించాల్సి ఉంటుంది. మూడేళ్ల నుంచి ఆ సంస్థలు రాష్ట్ర వేర్ హౌజింగ్ కార్పొరేషన్‌కు చెల్లించకపోవటంతో మార్కెట్ కమిటీలకు అద్దె రావటం లేదు. దీంతో గిడ్డంగుల అభివృద్ధి ఆగిపోయింది.

# తల్లీ పిల్లల ఆస్పత్రిలో వైద్యుల కొరత

కొత్తగూడెం : కొత్తగూడెంలోని రామవరంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మాతా, శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో వైద్యుల కొరత వేధిస్తోంది. ఉండాల్సిన సంఖ్య కంటే తక్కువగా ఉండటంతో వైద్యులు పనిఒత్తిడికి గురవుతున్నారు. సాధారణ ఓపీ, పరీక్షల కోసం వచ్చే గర్భిణులు నిరీక్షించలేక నీరసించిపోతున్నారు. ఇది వంద పడకల సామర్థ్యం గల ఆస్పత్రి. ఆరుగురికి గాను కేవలం నలుగురు మాత్రమే ప్రసూతి వైద్య నిపుణులు విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలోనూ ఇద్దరు కాంట్రాక్టు బేసిక్‌పై పనిచేసేవారే. మరొకరు వైద్య విద్యార్థి. మిగిలిన ఒకరు శాశ్వత వైద్యురాలు. వీరిలో ప్రస్తుతం ఒకరు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఫలితంగా ముగ్గురూ విధిగా నిత్యం అందుబాటులో ఉండాల్సి వస్తోంది. ఎవరైనా వారాంతపు సెలవులో ఉంటే ఇద్దరు నిపుణులు ప్రసూతి సేవలను పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నారు. ఓపీలో చూసేవారే కరవవుతున్నారు. ఇంకోవైపు ప్రసవాల నిర్వహణ యాతనగా మారుతోంది. సేవల్లో జాప్యంతో గర్భిణులు, బాలింతల బంధువుల్లో ఎవరో ఒకరు తరచూ ఆందోళన చేస్తున్నారు. ఇటీవల కు.ని.శస్త్రచికిత్సల్లో జాప్యంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేయగా... ఓపీ చూసే వైద్యురాలు ఆ ప్రక్రియ ముగిసేంత వరకు వేచిచూడక తప్పని పరిస్థితి ఎదురైంది.

ఓపీలు పెరిగినా..మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో రోజుకు సగటున 100 నుంచి 160 మంది గర్భిణులు, బాలింతలు వైద్య పరీక్షలకు వస్తున్నారు. వీరిలో కనీసం రోజుకు 15 నుంచి 20 మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. రోజుకు సగటున 5 నుంచి 8 మందికి శస్త్రచికిత్స ద్వారా కాన్పులు జరుగుతున్నాయి. మరో అయిదు వరకు సాధారణ ప్రసవాలు నమోదవుతున్నాయి. భద్రాచలం, పాల్వంచ ఆసుపత్రుల నుంచి రిఫరల్‌పై సుమారు మూడు, నాలుగు కేసులు అత్యవసర పరిస్థితుల్లో ఎంసీహెచ్‌కు వస్తున్నాయి. కొందరికి సంక్లిష్ట పరిస్థితుల్లో ప్రసవాలు నిర్వహించాల్సి వస్తోంది. ఆ సమయాల్లో వైద్య నిపుణుల కొరత కారణంగా ఇతర సేవలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. సేవల్లో జాప్యం.. అత్యవసర వేళల్లోనూ సిబ్బంది నుంచి అరకొర స్పందన ఉండటంతో చాలా మంది గర్భిణులను ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారు. అంతిమంగా ఎంసీహెచ్ కేంద్రం ముఖ్య లక్ష్యం నీరుగారిపోతోంది. ప్రభుత్వం ఆదేశిస్తున్నా.. సాధారణ ప్రసవాల సంఖ్య పూర్తిగా తగ్గుముఖం పడుతోంది.

అసలే సమస్యలు.. ఆపై ఆధిపత్య పోరు

మూలిగే నక్కమీద తాటిపండు పడ్డ చందంగా ఎంసీహెచ్‌లో వైద్యుల కొరతే ఉందంటే.. అందులోనూ అంతర్గతంగా ఆధిపత్య పోరు నెలకొనడం సమస్య జటిలమవుతోంది. వైద్యుల మధ్య సఖ్యత లేకపోవడంతో ప్రథమంగా రోగిని ఎవరు పరీక్షిస్తే వారే ప్రసవం వరకు సేవలందించాలనే సంస్కృతికి ఆజ్యం పోశారు. ఒకరు చూసిన కేసును మరొకరు కన్నెత్తి చూసే పరిస్థితుల్లేక బాధితులు వెనుదిరిగి పోతున్న ఉదాహరణలు అనేకం ఉన్నాయి. కాన్పు, ఇతర కీలక వైద్య సేవల్లో డబ్బులిస్తేనే పని అవుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఒప్పందాలతోనే వైద్యులు ఒకరు చూసిన కేసును మరొకరు చూడటం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రసవాలే కాకుండా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల్లో వైద్య సిబ్బంది తీరు విమర్శలకు గురవుతోంది. నిర్ణీత సమయాల్లో ఆపరేషన్ చేస్తామని చెప్పి.. ఆ తర్వాత మరో రోజు రావాలని చెబుతుండటంతో బాధితులు వ్యయప్రయాసలకు గురవుతున్నారు. వైద్యులకు అనుకూలంగా సిబ్బంది సైతం వర్గాలు విడిపోయారనే ఆరోపణలున్నాయి. ఈ పరిణామాలు ఆదిలోనే ఎంసీహెచ్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయి. ఆస్పత్రిలో చికిత్సలకు ఎవరైనా డబ్బులడిగితే నేరుగా ఫిర్యాదు చేయాలని కలెక్టర్ డి.అనుదీప్ సైతం సహాయ కేంద్రం ప్రకటించారంటే అక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చనే ప్రచారం ఆయా వర్గాల్లో జరుగుతోంది.

ఆస్పత్రి నిర్వహణలో లోపాలపై డీసీహెచ్‌ఎస్ డా.ముక్కంటేశ్వరరావుతో మాట్లాడుతూ అన్ని పరిస్థితులు చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒక వైద్యురాలిని తాజాగా నియమించామని.. త్వరలో ఆమె విధుల్లో చేరుతారన్నారు.

## కదలని ధాన్యం రాశులు.. అన్నదాతల పడిగాపులు

ఖమ్మం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. నెలరోజుల క్రితమే కేంద్రాలు ప్రారంభించినా.. పంట విక్రయించేందుకు అన్నదాతలకు పడిగాపులు తప్పడం లేదు. మిల్లర్ల కొర్రీలు, సకాలంలో ధాన్యం రవాణా కాక కేంద్రాల వద్ద రోజులకొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. గత సీజన్లతో పోలిస్తే వరి విస్తీర్ణం తగ్గి ధాన్యం దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ధాన్యం సేకరణ లక్ష్యంగా కూడా సగానికి పడిపోయింది. అయినా రైతు ఆశించిన మేర కొనుగోళ్లు జరగడం లేదు. రోజుకో తీరుగా మారుతున్న వాతావరణ పరిస్థితులు కర్షకుల గుండెల్లో మరింత గుబులు పుట్టిస్తున్నాయి.

నెమ్మదిగా..ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ధాన్యం రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఉభయ జిల్లాల్లో ఏప్రిల్ 14న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఖమ్మం జిల్లాలో 216 కేంద్రాలు తెరవగా.. 111 కేంద్రాల్లో ధాన్యం కొనగోలు చేస్తున్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యం 2 లక్షల మెట్రిక్ టన్నులు కాగా.. ఇప్పటికే సగం పంటను రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. సుమారు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి సేకరిస్తామని అధికారులు చెబుతున్నారు. నెలరోజులు దాటుతున్నా ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం మాత్రం 26,328 మెట్రిక్ టన్నులు మాత్రమే. భద్రాద్రి జిల్లాలోనూ ఇదే పరిస్థితి. 158 కేంద్రాలు ప్రారంభించగా.. 48 కేంద్రాల్లోనే కొనుగోళ్లు సాగుతున్నాయి. ఈసారి ధాన్యం సేకరణ లక్ష్యం 50 వేలు మెట్రిక్ టన్నులు కాగా.. ఇప్పటి వరకు కేవలం 5,336 మెట్రిక్ టన్నులే సేకరించారు.

కేంద్రాల్లోనే..తక్కువ ధాన్యమే వస్తున్నప్పటికీ కొనుగోళ్ల ప్రక్రియ ఊపందుకోవడం లేదు. కేంద్రాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గన్నీ సంచుల కొరత వేధిస్తుంది. ధాన్యం కాంటాలు వేసినా సకాలంలో లారీలు రాక పడిగాపులు తప్పడం లేదు. హమాలీలు సరిపడా లేక ఇక్కట్లు తప్పడం లేదు. 1010 రకానికి చెందిన వడ్లు తీసుకునేందుకు మిల్లర్లు తిరస్కరిస్తున్నారు. ఇప్పటికే అకాల వర్షంతో కొన్ని కేంద్రాల్లో ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడ్డారు.

ఆపొద్దని ఆదేశాలిచ్చాం ఎన్.మధుసూదన్, అదనపు కలెక్టర్, ఖమ్మం

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా అన్ని కేంద్రాలకు సూచనలు చేస్తున్నాం. దొడ్డు రకం ధాన్యం మిల్లర్లు తీసుకునేందుకు నిరాకరించడం వల్ల కొంత ఆలస్యం అవుతుంది. సమస్యను పరిష్కరించాం. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు సాగేలా చర్యలు తీసుకుంటాం.



# మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి సీఎం వైయస్ జగన్ శంకుస్థాపన

శ్రీకాకుళం: ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కలను ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ముందుగా మూలపేట తీరం వద్ద గంగమ్మ తల్లికి సీఎం వైయస్ జగన్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ.4,362 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పోర్టు పనులకు శంకుస్థాపన చేశారు. 23.5 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో 4 బెర్తుల నిర్మాణం జరగనుంది. 30 నెలల్లో పోర్టు నిర్మాణ పనులు పూర్తికానున్నాయి. దీని వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 25 వేల మందికి ఉపాధి లభించనుంది. విష్ణుచక్రం, మూలపేటకు చెందిన 594 మంది నిర్వాసిత కుటుంబాలకు పునరావాసానికి రూ.109 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. నౌపడలో 55 ఎకరాల్లో ఆధునిక వసతులతో ఆర్ అండ్ ఆర్ కాలనీలను నిర్మిస్తోంది. అనంతరం బుడగట్లపాలెం తీరంలో రూ.365.81 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి, రూ.176.35 కోట్లతో వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, రూ.852 కోట్లతో మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులకు సీఎం వైయస్ జగన్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ వెంట శ్రీకాకుళం జిల్లా మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌న్యాద్, స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు నేతలు పాల్గొన్నారు.

# సీబీఐ విచారణకు హాజరైన ఎంపీ అవినాష్‌రెడ్డి



హైదరాబాద్: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైకాపా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ముందు హాజరయ్యారు. ఐదోసారి ఆయన సీబీఐ విచారణకు వెళ్లారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి బయల్దేరి కోఠిలోని సీబీఐ కార్యాలయానికి వెళ్లారు. సీబీఐ నోటీసుల నేపథ్యంలో తెలంగాణ హైకోర్టులో అవినాష్ ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం దీనిపై విచారణ చేపట్టిన కోర్టు.. ఆయన్ను ఈనెల 25 వరకు అరెస్ట్ చేయవద్దని సీబీఐని ఆదేశించింది. అయితే అప్పటి వరకు సీబీఐ కార్యాలయంలో ప్రతి రోజూ విచారణకు హాజరుకావాలని షరతు విధించింది. అవినాష్‌కు ప్రశ్నలను రాతపూర్వకంగా ఇవ్వాలని.. విచారణను ఆడియో, వీడియో రికార్డు చేయాలని సీబీఐని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 25న తుది ఉత్తర్వులు జారీ చేస్తామంటూ విచారణను వాయిదా వేసింది.

# 'వివేకా హత్య కేసులో సూత్రధారుడు జగనే.. రాజశేఖర్ రెడ్డి బతికుంటే మాత్రం..'



అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యలో వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఇతరులంతా పాత్రధారులు మాత్రమే అని.. సూత్రధారుడు మాత్రం జగన్మోహన్ రెడ్డే అని టీడీపీ ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డికి చెప్పే వివేకానంద రెడ్డిని హత్య చేశారన్నారు. సీబీఐ ఇంకా లోతుగా దర్యాప్తు చేస్తే అసలు కుట్రదారుడు జగన్మోహన్ రెడ్డేనని తేలిపోతుందని తెలిపారు. వివేకానంద రెడ్డిని చంపించి సానుభూతి ఓట్లు పొందవచ్చనే జగన్మోహన్ రెడ్డి ప్లాన్ సక్సస్ అయిందన్నారు.

**ఢిల్లీ పైరవీలకు జగన్ తెర: దేవినేని** – వివేకా హత్య కేసుకు సంబంధించి ఢిల్లీ పైరవీలకు జగన్మోహన్ రెడ్డి తెరలేపారని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో సీఎం అందుబాటులో ఉండాలని సీఎస్ చెప్పటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రం దివాళా తీసిందని నిన్నటి సీఎస్ ప్రకటనతో అర్థమవుతోందని తెలిపారు. రాష్ట్ర విభజన ద్వారా ఏపీకి రావాల్సినవి ఏమీ తేకపోగా అవినాష్ రెడ్డిని కాపాడేందుకు ఢిల్లీ పర్యటనకు వంకలు వెదుక్కుంటున్నారని మండిపడ్డారు. రాజశేఖర్ రెడ్డి బతికి ఉంటే జగన్ వైఖరి చూసి నిజంగా చనిపోయేవాడన్నారు. చనిపోయిన వివేకా వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్న జగన్మోహన్ రెడ్డి.. కోటలో కూర్చున్నా ఒక్కటే పేటలో కూర్చున్నా ఒక్కటే అని అన్నారు. ఏ మాత్రం నైతిక విలువలు ఉన్నా తక్షణమే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని దేవినేని ఉమా డిమాండ్ చేశారు.

# లోకేష్ పాదయాత్రలో ఆసక్తికరమైన సన్నివేశం..




కర్నూలు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఆసక్తికరమైన సన్నివేశం చోటు చేసుకుంది. కర్నూలు జిల్లా, ఆలూరు నియోజకవర్గం పుప్పలదొడ్డిలో యువగళం పాదయాత్ర కొనసాగుతున్న సమయంలో ఓ బుడతడు పసుపురంగు టీషర్టుతో ఉత్సాహంగా యాత్రలో అడుగులు వేశాడు. అది గమనించిన లోకేష్ ఆ బాలుడ్ని దగ్గరకు తీసుకొని అప్యాయంగా పలకరించి కుశలప్రశ్నలు వేశారు. అప్పుడే రాజకీయాలు వద్దని.. ముందు మంచిగా చదువుకోవాలని చెప్పి టీషర్టు తీయించి బాలుడికి నచ్చజెప్పి పంపించివేశారు. ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో చూస్తూ లబ్ధిపొందేందుకు తహతహలాడుతున్న ఈ రోజుల్లో బాలుడి భవిష్యత్ కోసం దూర దృష్టితో లోకేష్ ఆలోచించారు.

కాగా నారా లోకేష్ యువగళం పాదయాత్ర 76వ రోజుకు చేరుకుంది. ప్రస్తుతం ఆలూరు నియోజకవర్గంలో పాదయాత్ర సాగుతోంది. ఈరోజు ఉదయం వలగొండ క్రాస్ క్యాంప్ సైట్ నుంచి లోకేష్ పాదయాత్రను ప్రారంభించారు. యువనేత పాదయాత్రకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మద్దతు తెలుపుతున్నారు. లోకేష్‌తో కలిసి పాదయాత్ర చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో మహిళలు, యువతతో లోకేష్ ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే త్వరితగతిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇస్తూ లోకేష్ పాదయాత్రలో ముందుకు సాగుతున్నారు.

# ఏపీ ఉద్యోగుల సంఘం నేత సూర్యనారాయణకు మరోసారి నోటీసులు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి నోటీసులు జారీ చేసింది. సూర్యనారాయణ అధ్యక్షుడిగా ఉన్న ఏపీ వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలని నోటీసుల్లో పేర్కొంది. గతంలో వాణిజ్య పన్నుల శాఖలోని ఉద్యోగుల బదిలీలకు సంబంధించి అదనపు కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగడంపై ప్రభుత్వం నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. కార్యాలయం వెలుపల ఉన్నతాధికారిని దిగ్బంధించి ఆందోళన చేయడంపై సంజాయిషీ ఇవ్వాలని కోరింది. ప్రస్తుతం మరోమారు నోటీసులు జారీ చేస్తూ.. సంఘం గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

# కడపలో విషాదం.. రైలు కిందపడి దంపతుల ఆత్మహత్య



కడప: కడపలో విషాదం చోటు చేసుకుంది. వివాహం జరిగిన ఏడాదికే దంపతులు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడపలోని విజయదుర్గా కాలనీకి చెందిన సాయికుమార్ రెడ్డి, హేమమాలినీలకు ఏడాది క్రితం వివాహమైంది. సాయికుమార్ రెడ్డి వ్యాపారాలు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ నేపథ్యంలో గత కొద్ది రోజుల నుంచి భార్యాభర్తలిద్దరూ ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. హేమమాలిని 8 నెలల గర్భవతి.

ఆర్థిక సమస్యలు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది భార్యాభర్తలిద్దరూ మంగళవారం రాత్రి కడప శివారులోని కనుమలోపల్లి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలుసుకున్న కడప రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. దంపతుల మృతికి ఆర్థికపరమైన సమస్యలా? ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్ పాత కాపులను దువ్వుతున్న నల్లారి ...బీజేపీలోకి వలసలే



అమరావతి : ఉమ్మడి ఏపీకి చిట్టచివరి సీఎం అయిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అనూహ్యంగా బీజేపీలో చేరిపోయారు. ఆ పార్టీతోనే తన భవిష్యత్తు అని ఆయన గట్టిగా నమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో కిరణ్ తన సత్తా చాటుకునే పనిలో పడ్డారు. తాను ఒక్కడినే చేరితే ఏమి విలువ ఉంటుందని అనుకున్నారో ఏమో కానీ ఆయన తన వెంట బీజేపీలోకి వచ్చే వారి లిస్ట్ ని రెడీ చేయిస్తున్నారు. తాను సీఎం గా ఉన్నపుడు కాంగ్రెస్ లో తనతో కలసి తిరిగిన వారు సన్నిహితుల జాబితాను ఆయన సిద్ధం చేస్తున్నారు. కొంతమంది నేతలతో ఆయన నేరుగా మాట్లాడి మరీ బీజేపీ వైపు ఆహ్వానం పలుకుతున్నారు. అలా కిరణ్ గుర్తించిన నాయకులు మామూలు వారు కాదు రాజకీయంగా దిగ్గజ నేతలే. కాలసి రాక కొందరు ఏ పార్టీలో చేరలేక మరికొందరు అలా ఉన్నారు. వారిలో మాజీ పీసీసీ చీఫ్ లు అయిన రఘువీరారెడ్డి సాకే శైలజానాథ్ కర్నూల్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి గోదావరి జిల్లాలకు చెందిన కేంద్ర మంత్రి పల్లం రాజు అదే విధంగా మాజీ ఎంపీ జి హర్షకుమార్ వంటి వారికి బీజేపీలోకి రప్పించేందుకు కిరణ్ స్వయంగా రంగంలోకి దిగి చర్చలు జరుపుతున్నారని తెలుస్తోంది. కిరణ్ కొంతమందితో ఇప్పటికే ఫోన్ల ద్వారా సంప్రదింపులు జరిపారని తెలుస్తోంది. అదే విధంగా మరి కొందరికి రాయబారాలు పంపుతున్నారని భోగట్టా. ఇక తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న పల్లం రాజు సీనియర్ మోస్ట్ నేత. ప్రముఖ రాజకీయ కుటుంబం బలమైన కాపు సామాజికవర్గానికి చెందిన నాయకుడు. ఆయన కనుక బీజేపీలో చేరితే సమీకరణలు మొత్తం మారుతాయి. అలాగే ఏరాసు ప్రతాపరెడ్డి జి హర్షకుమార్ వంటి వారికి సొంతంగా బలం ఉంది. అలాగే రఘువీరా సాకే శైలజనాథ్ వారి సొంత ఇలాకాలో పట్టున్న వారే.

మరి వీరంతా కిరణ్ మాటకు కట్టుబడి బీజేపీ వెంట నడుస్తారా అన్నదే చూడాలని అంటున్నారు. అయితే బీజేపీ జాతీయ పార్టీ అని మళ్లీ అధికారంలోకి వస్తుందని భవిష్యత్తు బాగుంటుందని కిరణ్ వారితో చెబుతున్నాట్లుగా ప్రచారం సాగుతోంది ఇక కిరణ్ కుమార్ రెడ్డి తొందరలో ఏపీలో విస్తృతంగా పర్యటించి వివిధ జిల్లాల నేతలలతో చర్చలు జరుపుతారని అంటున్నారు.

ఏపీలో బీజేపీ బలోపేతానికి తను కృషి చేస్తూ దాన్ని కేంద్ర పెద్దల దృష్టిలో పెట్టాలన్నది కిరణ్ కుమార్ రెడ్డి ఆలోచనగా చెబుతున్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో ఏపీలో బీజేపీ టీడీపీల మధ్య పొత్తులు కుదర్చాలని కిరణ్ భావిస్తున్నారు అని అంటున్నారు. అది కనుక సాకారం కావాలీ అంటే కనుక బీజేపీ పెద్దల వద్ద మంచి మార్కులు పడాలి. వారి వద్ద కిరణ్ ఏపీలో బలమైన నేతగా కనిపించాలి. అందుకే ముందుగా ఈ వలసలతో ఏపీలో తన వర్గం ఇంత ఉంది అని చెప్పుకోవడానికి ఆయన కాంగ్రెస్ పాత కాపులను దువ్వుతున్నారని అంటున్నారు. చూడాలి మరి కిరణ్ వెంట ఎంతమంది నడుస్తారో.

# అరెస్టులు వైసీపీకి మైనస్సా.. ప్లస్సా.. సింపతీ రాజకీయం ఎంత..?



అమరావతి : సాధారణంగా రాజకీయాల్లో ఏం జరిగినా.. పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తాయి. మరీ ముఖ్యంగా ఏపీ వంటి రాష్ట్రంలో అయితే.. ఈ సింపతీ రాజకీయాలకు మరింత గ్రాఫ్ ఉంటుంది. సో.. ఏ పార్టీ కూడా తమకు అందివచ్చిన అవకాశాన్ని వదులుకునే ప్రయత్నం చేయదు. గతంలో చంద్ర బాబు కూడా తనపై అలిపిరిలో మావోయిస్టులు దాడి చేసినప్పుడు సింపతీ కోసం.. ఎన్నికలకు వెళ్లారు. ఇక గతంలో ఒకసారి భూమా నాగిరెడ్డిని పోలీసులు అరెస్టు చేసినప్పుడు ఆయన దానిని అడ్డు పెట్టుకుని ఎన్నికల్లో విజయం దక్కించుకున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ హయాంలోనూ కోట్ల విజయభాస్కరరెడ్డిపై నమోదైన కేసులు.. అప్పట్లో ఆయనకు తిరుగులేని సింపతీని తెచ్చిపెట్టాయి. అంటే.. కేసులు.. అరెస్టులు కూడా.. రాజకీయాలకు నేతలకు అవసరాన్ని బట్టి అందివస్తున్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఇక ఇప్పుడు వైసీపీని అరెస్టులు.. కేసులు వెంటాడుతున్నాయి. ఒకవైపు వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సొంత చిన్నాన్న వైఎస్ భాస్కరరెడ్డి అరెస్టు సీఎం జగన్ను కుదిపేస్తోంది. ఇక ఎంపీ అవినాష్ రెడ్డి విషయం కూడా అదే పరిస్థితిలో ఉంది. మరోవైపు.. గత ఎన్నికల్లో కలిసి వచ్చిందని ప్రతిపక్షాలు చెబుతున్న కోడి కత్తి కేసు ఈ దఫా కూడా చర్చకువ చ్చింది. అయితే.. ఇది తేలిపోయేలా కనిపిస్తోంది అంటున్నారు.

ఈ పరిణామాలతో వైసీపీకి లాభమెంత? వచ్చే ఎన్నికల్లో ఈ అరెస్టులు.. ఈ కేసులు.. ఆ పార్టీకి మేలు చేకూరుస్తాయా? లేదా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ప్రస్తుతం అయితే.. ఇవి వైసీపీకి ఇబ్బందిగానే పరిణమించేలా ఉన్నాయని అంటున్నారు. ఎంపీ అవినాష్ అరెస్టు అయితే.. సింపతీ రాకపోగా.. మరింత మైనస్ ఎదురయ్యే ఛాన్స్ ఉంటుందని చెబుతున్నారు. అదే సమయంలో కోడికత్తి కేసు తేలిపోతే.. అది సీఎం జగన్కు మచ్చగా మారిపోతుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో సింపతీ సంపాయించుకోవడం కష్టమేనని పరిశీలకులు అభిప్రాయపడుతుండడం గమనార్హం.

# మాటలు సరే.. పునాది రాళ్లు ఏవి పవన్?




విజయవాడ : జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాటలు ఎలా ఉంటాయన్న విషయాన్ని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మిగిలిన రాజకీయ అధినేతలకు భిన్నంగా ఆయన మాటలు ఉంటాయి. తరచూ ఆయన చేసే ప్రసంగాల్లో నీతి ప్రస్తావనతో పాటు. రొటీన్ రాజకీయ అధినేతలకు భిన్నమైన రీతిలో ఆయన ప్రసంగాలు సాగుతుంటాయి. తన గురించి.. తనకున్న పొలిటికల్ కమిట్ మెంట్ గురించి ఆయన ఎప్పుడూ ఆసక్తికరమైన విషయాల్ని చెబుతుంటారు. ఇవన్నీ పవన్ మీద మరింత క్రేజ్ ను పెంచేలా చేస్తుంటాయి. ఇదంతా ఒక ఎత్తు అయితే.. ఆయన మాటలు ఎంత ఉన్నతంగా ఉంటాయో.. ఆయనచేతలు అంతకు భిన్నంగా ఉంటాయన్నది మర్చిపోకూడదు. అలా అని ఆయన తప్పులు చేస్తారు.. నేరాలు.. ఘోరాలకు పాల్పడుతుంటారని చెప్పటం మా ఉద్దేశం కాదు. మాటలు ఉన్నతంగా ఉన్నప్పుడు.. అందుకు తగ్గట్లే చేతల ప్లానింగ్ అంతే భారీగా ఉంటే మెరుగైన ఫలితాలు ఉంటాయన్నది మర్చిపోకూడదు. జనసేన పార్టీ పెట్టి ఆయన తొమ్మిదేళ్లు అవుతోంది. మరో ఏడాదిలో జరిగే ఏపీ ఎన్నికల్లో తన పార్టీ కీలకంగా మారుతుందన్న విషయం పై ఆయన ఎంతో నమ్మకంతోనూ.. పట్టుదలతో ఉన్నారు. ఇదే విషయం ఆయన మాటల్ని విన్నంతనే కలుగుతుంది. మరి ఎన్నికల్లో అలాంటి తీరును ప్రదర్శించాలంటే అందుకు తగ్గట్లు పార్టీ నిర్మాణం సాగాలి. ఏపీలో ఉన్న మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లో జనసేనకు ఉన్న బలం ఏమిటి? ఆయనకున్న నాయకులు ఎవరు. క్యాడర్ బలం మాటేమిటి? అన్న విషయాన్ని తీసుకుంటే. అన్నింటిలోనూ లోపాలే కనిపిస్తాయి. ఒక రాజకీయ పార్టీని ఏర్పాటు చేయటం ఎంత కష్టమో.. దాన్ని కొనసాగించటం అందునా పవర్ చేతిలో లేకుండా ఉంటే నిప్పుల నడకే. ఈ విషయంలో పవన్ ను మెచ్చుకోవాల్సిందే. ఎందుకంటే ఆయన ఎంతో ఓపిగ్గా ఒక్కో అడుగు ముందుకు వేసుకుంటున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. నేటికి ఏపీలోని అన్ని నియోజకవర్గాలకు జనసేనకు ఉన్న నేతలు.క్యాడర్ ఏమిటన్న దాని పై బోలెడన్ని సందేహాలు ఉన్నాయి. ఇలాంటి సంస్థాగత మార్పుల మీద ఫోకస్ పెట్టకుండా. రాజకీయాలు నడపటం అంత సులువైన విషయం కాదన్న విషయాన్ని పవన్ ఎప్పటికి తెలుసుకుంటారు. పదవుల మీద తనకు ప్రత్యేక ఆశలు లేవనే ఆయన.. మీరు (ప్రజలు) ఎన్నుకుంటే మీకు సేవ చేస్తానని చెబుతారే కానీ.. అంతకు మించిన మాటలు ఏమీ పవన్ నోటి నుంచి రావు. ఇలాంటివి బాగానే ఉన్నా.. జనసేన వ్యవస్థాగత టీం ఎంపిక ఇప్పటికి సరైన రీతిలో కసరత్తు చేయలేదన్న విషయాన్ని మర్చిపోకూడదు. పవన్ పార్టీలో నాదెండ్ల మనోహర్ ఒక్కరే కాస్త పేరు ప్రఖ్యాతులు ఉన్న అధినేత. ఆయన తప్పించి సరైన నాయకుడు లేని పరిస్థితి. మరి ఈ లోటును పవన్ ఎలా అధిగమిస్తారు? అన్నది ప్రశ్న. ఈ విషయంలో పవన్ ఎంత వేగంగా నిర్ణయాలు తీసుకుంటే అంత మంచిదని చెప్పాలి.

ఇప్పటికే సరైన పునాది రాళ్లు వేయకుండానే తొమ్మిదేళ్లు పార్టీ బండిని లాగిన పవన్.. ఇప్పటికైనా తాను చేస్తున్న తప్పుల్ని ఒప్పులుగా మార్చుకోవాల్సిన అవసరాన్ని గుర్తించుకోవాలి. ఈ నేపథ్యంలో మాటలు చెప్పే పవన్ అందుకు భిన్నంగా చేతల్లోనూ చేసి చూపాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పునాది రాళ్లు లేకుండా ఎంత అద్భుతమైన భవనాన్ని నిర్మిస్తే ప్రయోజనం ఏమిటి?

# యువనేత లోకేష్‌ను కలిసి కన్నీరుమున్నీరైన ఖాసింబీ




కర్నూలు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర బుధవారం నాటికి 75వ రోజుకు చేరుకుంది. ప్రస్తుతం ఆలూరు నియోజకవర్గంలో పాదయాత్ర సాగుతోంది. కుప్పాల దొడ్డిలో చిరుమాను దొడ్డి గ్రామస్తురాలు ఖాసింబీ యువనేత లోకేష్‌ను కలిసి తమ కష్టాలు చెప్పుకొని కన్నీరుమున్నీరైంది. తన భర్త రైతు కింజారి రంజన్ గత నెల 31న ఆత్మహత్య చేసుకున్నాడని, గత రెండేళ్లుగా నకిలీ విత్తనాలు, పురుగుల మందులతో పంటనష్టం వచ్చిందని వాపోయింది. సుమారు రూ.9 లక్షలు అప్పుల పాలయ్యామని, వడ్డీలు కట్టలేని పరిస్థితి రావడంతో.. తన భర్త మానసిక ఒత్తిడితో పొలంలోనే పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడని వెల్లడించింది. బాకీ తీర్చాలని అప్పులవాళ్లు తమపై ఒత్తిడి చేస్తున్నారని, జిల్లా కలెక్టర్‌ను కలిసినా ప్రభుత్వం నుండి నేటికీ పరిహారం అందలేదని ఖాసింబీ తెలిపింది. 'మా కుటుంబాన్ని మీరే ఆదుకోవాలి సార్' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై స్పందించి లోకేష్ మాట్లాడుతూ... జగన్ పాలనలో వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఖాసింబీ కుటుంబమే ఇందుకు ఉదాహరణ అన్నారు. అస్తవ్యస్త విధానాల కారణంగా దేశంలో రైతు ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ 3వ స్థానంలో ఉందన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఖాసింబీ కుటుంబానికి పరిహారం కోసం ప్రభుత్వానికి లేఖరాసి పరిహారం అందేలా కృషిచేస్తామని లోకేష్ స్పష్టం చేశారు.

# సీబీఐ కస్టడీకి వైఎస్ భాస్కరరెడ్డి, ఉదయ్‌కుమార్



హైదరాబాద్: మాజీ మంత్రి వివేకా హత్య కేసులో అరెస్టయిన నిందితులు వైఎస్ భాస్కరరెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలను సీబీఐ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. చంచల్‌గూడ జైలులో ఉన్న నిందితులను ఉస్మానియా ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం విచారణ నిమిత్తం కోఠిలోని సీబీఐ కార్యాలయానికి తరలించారు. ఇటీవల అరెస్ట్ చేసిన భాస్కరరెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలను 10 రోజులపాటు కస్టడీకి ఇవ్వాలంటూ సీబీఐ పిటిషన్లు దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన సీబీఐ న్యాయస్థానం.. వాళ్లిద్దరినీ కస్టడీకి అప్పగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 19 నుంచి 24 వరకు ఆరు రోజులపాటు కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారణ నిమిత్తం చంచల్‌గూడ జైలు నుంచి కస్టడీకి తీసుకోవడానికి అనుమతిస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు.

## తెల్లగా కనిపించేందుకు సర్జరీ చేయించుకుందా...?

బాలీవుడ్ లో సుదీర్ఘ కాలంగా హీరోయిన్ గా కొనసాగుతున్న ముద్దుగుమ్మ కాజోల్ కెరీర్ ఆరంభంలో నల్లగా ఉండేది. ఆ విషయాన్ని ఆమె కూడా ఒప్పుకుంటుంది. తాను గతంలో నల్లగా బండగా ఉన్నానంటూ కొందరు విమర్శించే వారు. ఆ సమయంలో కొందరు నేను తెల్లగా కనిపించేందుకు సర్జరీ చేయించుకున్నాను అంటూ ప్రచారం చేశారు. తెల్లగా కనిపించేందుకు సర్జరీ చేయించుకుంది అంటూ వస్తున్న వార్తలపై కాజోల్ తాజాగా మరోసారి స్పందించింది. ఇటీవల ఒక సందర్భంగా కాజల్ మాట్లాడుతూ... తాను తెల్లగా కనిపించేందుకు ఎలాంటి సర్జరీలు చేయించుకోలేదు. అయితే ఒకప్పుడు



ఎండకు వెల్లినట్లుగా ఇప్పుడు ఎండకు వెళ్లడం లేదని చెప్పుకొచ్చింది. ఎండుకు వెల్లిన సమయంలో మొహం పై ట్యాన్ ఏర్పడుతుంది. ఇప్పుడు పూర్తిగా ఇంటికే పరిమితం అవ్వడం వల్ల ట్యాన్ ఏర్పడడం లేదని.. అందుకే తెల్లగా కనిపిస్తున్నాను అంటూ చెప్పుకొచ్చింది.

సోషల్ మీడియాలో కాజోల్ యొక్క సమాధానంను పలువురు పలు రకాలుగా విశ్లేషిస్తున్నారు. ఒకప్పుడు షూటింగ్స్ కోసం ఎక్కువగా ఔట్ డోర్ వెళ్లవలసి వచ్చేది. అందుకే కాజోల్ నల్లగా ఉండేది. కానీ ఇప్పుడు షూటింగ్స్ కు అసలు కాజోల్ బయటకు వెళ్లే పరిస్థితి లేదు. కనుక ఆమె తెల్లగా ఉందని ఆమె సన్నిహితులు కూడా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## అందాల ఆరబోతతో అదరగొడుతున్న కృతి సనన్..!

వన్ నేనొక్కడినే సినిమాతో సినీ రంగంలో అడుగు పెట్టిన కృతి సనన్ గురించి తెలుసు సినీ ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మొదటి సినిమాతోనే విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకుంది. కొత్త నటి అనే ఫీలింగ్ ఏమాత్రం రానీయకుండా అధ్భుతంగా నటించి మెప్పించిందీ ముద్దుగుమ్మ. కానీ ఆ తర్వాత నుంచి ఈమె నటించినా ఏ సినిమాలు హిట్టు కాలేదు. కాగా ప్లాపులు గా నిలిచాయి. కరోనా విపత్తుకు ముందు అంటే 2019 డిసెంబర్ 6వ తేదీన రిలీజ్ అయిన పానిపట్ చిత్రం నుంచి ఈమె కెరియర్ గ్రాఫ్ కిందికి పడిపోవడం మొదలైంది. 2021లో ఓటీటీ వేదికగా విడుదలైన సూపర్ డూపర్ సినిమా మిమిలోనూ ఈ ముద్దుగుమ్మ నటనకు మంచి మార్కులే పడ్డాయి. కేవలం సినిమాల



ద్వారానే కాకుండా ఈ క్యూట్ బ్యూటీ సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్ గా ఉంటుంది. తన పర్సనల్ లైఫ్ తో పాటు ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించిన అనేక విషయాలను తన అభిమానులతో పంచుకుంటుంది. ఓ వైపు అదిరిపోయే ఔట్ ఫిట్లతో అందాలు ఆరబోస్తూనే.. నెట్టింట తెగ రచ్చ చేస్తుంటుంది. అయితే తాజాగా ఈ ముద్దుగుమ్మ ఇన్ స్టా వేధికగా కొన్ని ఫొటోలను షేర్ చేసింది. అందులో అదిరిపోయే ఔట్ ఫిట్ తో దర్శనం ఇచ్చింది. లాంగ్ స్లైడ్ స్లిట్ డ్రెస్సులో అదిరిపోయే ఫోజులు ఇచ్చింది. థైస్ అందాలతో పాటు నడుము ఎద కనిపించేలా ఫొటోలు దిగింది. తలకు చేయి పెట్టుకొని కాస్త కాలు పైకెత్తి.. హై హీల్స్ లో దర్శనం ఇచ్చింది. ఈ ఫొటోలు చూసిన కుర్రకారు పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. కరెంటు తీగలా కనిపించే కృతి అందాలు చూస్తే.. ఎవ్వరైనా సరే ఫిదా కావాల్సిందే అంటూ చెప్పుకొస్తున్నారు. లక్షలాది మందికి క్రష్ గా మిగిలిన కృతి సనన్ పై ప్రతీ ఒక్కరికీ విపరీతమై ప్రేమ అని చెప్పుకొచ్చారు. నీ థైస్ నడుము ఎద అందాలు చూసేందుకు నిన్ను ఫాలో అవుతున్నామంటూ కామెంట్లు చేశారు. ఏది ఏమైనా నిన్ను మించిన అందం ఈ లోకంలో లేదంటూ మరికొంత మంది రాసుకొచ్చారు.




## కృతిశెట్టి ఎంట్రీతో ఆ భామని పక్కకు తొసేసారా?





కోలీవుడ్ లో అప్పుడే కృతిశెట్టి డామినేషన్ మొదలైం దా? నటించింది ఒక్క సినిమా అయినా? అప్పుడే డామినేషన్ ఏంటి ? అనుకుంటున్నారా? అయితే అసలు మ్యాటర్లోకి వెళ్లాల్సిందే. 'ది వారియర్' సినిమాతో అమ్మడు కోలీవుడ్ లో పరిచయమైంది. సినిమా ఫలితం సంగతి పక్కనబెడితే బ్యూటీకి తమిళ తంబీలు బాగానే కనెక్ట్ అయ్యారు. క్యూట్ క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ అక్కడి యువతని బాగానే ఆకట్టుకున్నాయి. వారియర్ రిలీజ్ కి ముందు తమిళ ఇంటర్వ్యూలు కృతికి మంచి గుర్తింపు ని తీసుకొచ్చాయి. అందులోనూ ఓ ఇంటర్వ్యూ లో కన్నీరు పెట్టుకున్న వీడియో ఏకంగా కోలీవుడ్ మీడియాలో వైరల్ గా మారింది. చేసింది తెలుగు హీరో సినిమా అయినా ? తమిళ హీరో సరసన చేస్తున్నంతగా పాపులర్ అయింది. ఇప్పుడీ బ్యూటీ కార్తీ కథానాయకుడిగా నలన్ కుమార్ స్వామి దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రంలో సెకెండ్ లీడ్ కి ఎంపికైంది. హీరో పాత్ర సహా స్టోరీ సెకెండ్ లీడ్ కూడా డిమాండ్ చేయడంతో కృతి శెట్టిని తీసుకున్నారు. ఇక మెయిన్ లీడ్ కి గాయత్రి భరద్వాజని ఎంపిక చేసారు. కార్తీ సరసన కనిపించే ప్రధానమైన రోల్ ఇది. కార్తీతో ఎక్కువ సన్నివేశాలు గాయత్రి పాత్రకున్నాయి. అయితే అనూహ్యంగా ఇప్పుడా పాత్ర బాధ్యతలు సెకెండ్ లీడ్కి ఎంపికైన కృతి శెట్టిని తీసుకుంటే బాగుం టుందని భావించి రీప్లేస్ చేసినట్లు తాజా సమాచారం. దీంతో గాయత్రి ..కృతిశెట్టి పాత్రలు తర్జుమా అయినట్లు తెలుస్తుంది. ఇది గాయత్రికి షాకింగ్ అయినా ఎలాంటి భేషజాలం చూపించకుండా సెకెండ్ లీడ్ అయినా సరే సిద్దంగానే ఉందని సమాచారం. ఆ రకంగా కృతి శెట్టి ఎంట్రీతో మొదటి నాయికకే ఎసరు పెట్టినట్లు కనిపిస్తుంది. సాధారణంగా ఇలాంటి సన్నివేశం ఎదురైనా మరో నటి అయితే? సినిమా నుంచి తప్పుకోవడమో! మీడియాకి ఎక్కి రచ్చ చేయమడో చేస్తుంది. కానీ గాయత్రి ఆ తరహా నటి కాదని తన హుందాతనంతోనే చాటి చెబుతుంది. గాయత్రి కూడా రీసెంట్ గానే కెరీర్ ప్రారంభించింది. వచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటుంది.

## పారీ పెళ్లి ముచ్చట సరే.. ఇంతకీ ఈ సంగతి తెలుసా?



పస్తుతం ఏ నోట విన్నా పరిణీతి పెళ్లి గురించే ముచ్చట. త్వరలోనే ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడు రాఘవ్ చద్దాను పరిణీతి చోప్రా పెళ్లాడేయబోతోందని పుకార్లు షికార్ చేస్తున్నాయి. ఏడాది చివరిలో ఈ జంట పవిత్ర వివాహంతో ఒకటి కాబోతున్నారు. వారి ప్రేమ వ్యవహారం గురించి పెదవి విప్పకపోయినా కానీ.. కలిసి లంచ్ లు- డిన్నర్ డేట్ లు.. విందు ఏర్పాట్లు ఈ పుకార్లను నిజం చేస్తున్నాయి. అదంతా అటుంచితే.. పరిణీతి చోప్రా ప్రపంచ యాత్రికురాలిగా అభిమానులకు సుపరిచితం. ఇంతకుముందు పారీ ఆస్ట్రేలియా యూరప్ పర్యటనలు వైరల్ అయ్యాయి. అయితే తన ప్రయాణాల్లో తనకు ఎదురైన అనుభవాల గురించి పారీ ఇప్పుడు మాట్లాడింది. మనం ఎక్కడికి వెళ్లినా చిరునవ్వుతో సరదాగా సంభాషించే తోటివారు కనిపిస్తారని... ప్రపంచం చిన్న చిన్న దయతో కూడుకున్నదని ప్రతి విహారంలో నేర్చుకున్నానని తెలిపింది. దయ అనేది చాలా దేశాలలో కనిపించే కామన్ లక్షణం అని నేను నమ్ముతున్నాను. అపరిచితులు సహాయం చేయడం. వసతి- భోజనం అందించడం .. నెట్ వర్క్ లు.. రోడ్లు లేదా రవాణా అందుబాటులో లేని సమయంలో బ్యాగులు మోయడంలో సాయపడడం.. ప్రపంచంలో ఎంత దయ ఉందో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. నేను కూడా ఎవరితో అయినా దయతో ప్రవర్తించేందుకు ప్రాధాన్యత ఇస్తాను. ఇతరులు తప్పులు చేసినప్పుడు క్షమించాలి"అని తెలిపింది . ఏప్రిల్ 2023 'లైఫ్ స్టైల్ ఆసియా' కవర్ స్టార్ గా పరిణీతి చోప్రా ఇంకా తన యాత్రల గురించి ఆసక్తికర సంగతులు చెప్పారు. ఇక పరిణీతి జీవితంలో సెటిలవ్వడం ఒక్కటే చర్చగా మారుతోంది. మొన్న ఫిబ్రవరిలో పరిణీతి ఓ ఇంటర్వ్యూలో వివాహం -పిల్లలను కనడం గురించి ఓపెనైంది. మీరు చేయాల్సిందల్లా నాకు వరుడిని కనుక్కోవడమే..మీరు ఏవైనా సిఫార్సులు చేస్తే వింటున్నాను. నా డ్రీమ్ బోయ్ ని కనుగొని ప్రేమలో పడిన రోజు వివాహం చేసుకోవాలనుకుంటున్నాను... అని పేర్కొంది. నేను అందరిలాగే పెళ్లి చేసుకుని పిల్లలను కలిగి ఉండాలనుకుంటున్నాను. నేను హెచ్చు తగ్గులతో కూడిన గొప్ప బ్యాలెన్స్ డ్ కెరీర్ ను కలిగి ఉండాలనుకుంటున్నాను. గెలుపోటములను సమానంగా స్వాగతిస్తున్నాను. నా కుటుంబం.. నా స్నేహితులతో సంతోషంగా ఆరోగ్యంగా ఉండాలనుకుంటున్నాను.. అని పారీ ముచ్చటించింది. ప్రస్తుతం పారీని పెళ్లాడే వరుడు ఆప్ నాయకుడు రాఘవ్ ఇంతకుముందు తమపై పుకార్లను ప్రస్తావించారు. తాము స్నేహితులం అని.. తరచుగా కలుసుకుంటామని తెలిపారు. దయచేసి నన్ను రాజకీయాల గురించి ప్రశ్నలు అడగండి.. పరిణీతి గురించి అడగొద్దు! అని కోరారు. అయితే ఈ జంట పెళ్లి గురించి చాలా విషయాలను మీడియా తవ్వి తీస్తోంది. ఈ సెలబ్రిటీ పెళ్లికి సంబంధించి అధికారిక అప్ డేట్ రావాల్సి ఉంది.

## వరసగా అర డజను హిట్లు కొట్టా.. ఒకటీ అరా ఫ్లాపులొస్తే నష్టమేంటి?

2022 బుట్టబొమ్మకు ఒక పీడ కల లాంటిది. ఆ ఏడాది నటించిన భారీ చిత్రాలన్నీ డిజాస్టర్లుగా మిగిలాయి. వీటిలో రాధేశ్యామ్- ఆచార్య- సర్కస్- బీస్ట్ లాంటి భారీ చిత్రాలున్నాయి. ప్రభాస్ - రామ్ చరణ్- రణవీర్- విజయ్ లాంటి అగ్ర కథానాయకులతో వరుస ఆఫర్లు తన లెవల్ ని మరో రేంజుకు తీసుకెళతాయని భావించింది. కానీ తానొకటి తలిస్తే దైవమొకటి తలచిన చందంగా అయ్యింది. వీటన్నిటిపైనా పూజా భారీ హోప్స్ పెట్టుకుని పరాజయాల్ని చవిచూసింది. జయాపజయాలతో సంబంధం లేకుండా అవకాశాలు తనని వరిస్తున్నా తాను భారీ ఫ్లాప్ లలో నటించడం తనని కంగారు పెట్టిందా? అంటే తాజా చాటింగ్ సెషన్ లో షాకిచ్చే జవాబిచ్చిది అమ్మడు. తాజాగా వరుస వైఫల్యాల గురించి పూజా ఒక ఇంటర్వ్యూలో తన మనసులో ఉన్న మాట చెప్పేసింది. "జయాపజయాలు అనేవి వృత్తిలో భాగం. అయినా పరాజయం పాలైంది నేను కాదు.. సినిమాలు



మాత్రమే బాగా ఆడలేదు"అని స్పష్టం చేసింది. ఫ్లాపైన సినిమాలకు తాను దర్శకురాలినో లేకపోతే ఎడిటర్ నో కాను అని నటిగా సత్తా చాటానని చెప్పింది. సినిమలు ఫ్లాపైనా నా నటనకు విమర్శలు రాలేదని అద్భుతమైన ప్రశంసలు అందుకున్నానని కూడా పూజా వెల్లడించింది. తెరపై తాను కనిపించిన తీరు నటన గురించి అందరూ ప్రశంసించారని పూజా తెలిపింది. వరుస చిత్రాల పరాజయాలు తనను ప్రభావితం చేయలేదని ఈ అనుభవాల నుండి తాను చాలా నేర్చుకున్నానని చెప్పింది. తన ఖాతాలో బ్లాక్ బస్టర్ల గురించి ఈ సందర్భంగా ప్రస్థావించిన పూజా ఒకానొక సమయంలో వరుసగా ఆరు బ్లాక్ బస్టర్ లు సాధించానని ఇప్పుడు ఒకటీ అరా ఫ్లాపులొస్తే నష్టమేంటి? అని కూడా ప్రశ్నించింది. కిసీ కా భాయ్ కిసీ కి జాన్ చిత్రంతో విజయం అందుకుంటానని కూడా పూజా ధీమాను కనబరుస్తోంది. ఈ బ్యూటీ ఇందులో ఒక తెలుగమ్మాయిగా కనిపించనుంది. ఈద్ కానుకగా ఈ చిత్రం విడుదల కానుంది. సల్మాన్ ఖాన్- వెంకటేష్ కీలక పాత్రలు పోషించగా భాయ్ సరసన పూజా నటించింది. రామ్ చరణ్ అతిథిగా ఓ పాటలో మెరుస్తారు. మహేష్ సరసన త్రివిక్రమ్ సినిమాలో పూజా కథానాయిక. అలాగే తదుపరి ఓ రెండు సినిమాల గురించి చర్చలు సాగిస్తున్నానని పూజా తెలిపింది.

## ఆ నడుము మడతలో పనసతొనలు ఊరిస్తుంటే

కన్నడ బ్యూటీ శాన్వి శ్రీవత్సవ లవ్ లీ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఆది సాయికుమార్ సరసన దర్శకురాలు బి.జయ ఈ క్యూట్ బ్యూటీని తెరకు పరిచయం చేసారు. లవ్ లీ లుక్స్ తో కుర్రకారు గుండెల్ని మెల్ట్ చేసిన శాన్వీ తొలి ప్రయత్నం ట్రెడిషనల్ గాళ్ గా కనిపించింది. ఆ తర్వాత విష్ణు సరసన ఆర్జీవీ డైరెక్షన్ లో ఎటాక్ సినిమాలో నటించింది. గ్లామర్ ఎలివేషన్ పరంగా హద్దులు చెరిపేసి చెలరేగిపోయింది. అయినా ఆ సినిమా ఆశించిన విజయం సాధించలేదు. ఆ తర్వాతి కాలంలో శాన్వీ పూర్తిగా కన్నడ పరిశ్రమకే అంకితమైంది. బహుభాషా చిత్రం శ్రీమన్నారాయణలో నాయికగా నటించి మెప్పించింది. సోషల్ మీడియాల్లో ఈ భామ జరంత స్పీడ్ గానే ఉంది. ఇన్ స్టాలో నిరంతరం ఫోటోషూట్లు షేర్




చేస్తూ ఫాలోయింగ్ ఏమాత్రం తగ్గకుండా కాపాడుకుంటోంది. చిట్టి పొట్టి నిక్కర్లు బికినీలతో కుర్రకారు మతులు చెడగొడుతోంది. ఇప్పటికే ఇన్ స్టాలో లక్షలాదిగా ఫాలోవర్స్ ని సంపాదించింది. ప్రతిసారీ ఏదో ఒక కొత్తదనం నిండిన కాన్సెప్ట్యువల్ ఫోటోషూట్ తో శాన్వీ ఆకట్టుకుంటోంది. శాన్వి తాజా ఫోటోషూట్ అభిమానుల్లోకి వైరల్ గా దూసుకెళుతోంది. అలా అందంగా చీర రవికెలో బాపు బొమ్మనే తలపిస్తోంది. ఇంతకీ గడియారాల షాపులో ఏం చేస్తోందో కానీ .. మరీ అంతగా ఎదురు చూపులు ఎవరి కోసమో.. ఇంతకీ ఆఫోజేమిటో... అలా నడుము మడతలో పనసతొనలు ఊరిస్తుంటే కుర్రకారు పరేషాన్ అయిపోతూ సోషల్ మీడియాల్లో కామెంట్లు చేస్తున్నారు.క్యూట్ బ్యూటీ ఇంకా కెరీర్ విషయంలో కాన్ఫిడెంట్ గా ఉంది. కన్నడలో అవకాశాలు అందుకుంటోంది. ప్రస్తుతం త్రిశూలం - బ్యాంగ్ అనే రెండు కన్నడ చిత్రాల్లో నటిస్తోంది. మహావీర్యార్ చిత్రంతో మలయాళంలోను అడుగుపెట్టింది. తదుపరి ఓ వెబ్ సిరీస్ కోసం కథ వింటోందని తెలిసింది.



# ప్రపంచంలో అత్యంత సంపన్న నగరాల్లో హైదరాబాద్

వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత సంపన్న నగరాల జాబితాలో హైదరాబాద్ 65వ స్థానంలో నిలిచింది. నగరంలో మొత్తం 11,100 మంది మిలియనీర్లు ఉన్నట్లు ప్రముఖ నివేదిక తెలిపింది. 2012 నుంచి 2022 మధ్య హైదరాబాద్‌లో 'అత్యధిక నికర సంపదగల వ్యక్తుల సంఖ్య 78 శాతం పెరగడం విశేషం. ఈ జాబితాలో అమెరికాలోని న్యూయార్క్ సిటీ తొలి స్థానంలో నిలిచింది. 2022 డిసెంబరు 31 నాటికి ఈ మహా నగరంలో 3,40,000 మంది మిలియనీర్లు ఉన్నట్లు హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ వెల్లడించింది. 'ప్రపంచంలోనే అత్యంత సంపన్న నగరాల నివేదిక 2023'ను మంగళవారం ఈ కంపెనీ విడుదల చేసింది. మొత్తం 97 పట్టణాలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. జపాన్ రాజధాని టోక్యో 2,90,300 మంది మిలియనీర్లతో రెండో స్థానంలో నిలిచింది. 2,85,000 మందితో శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియా మూడో స్థానంలో ఉంది. లండన్ (2,58,000), సింగపూర్ (2,40,100), లాస్ ఏంజెల్స్ (2,05,400), హాంకాంగ్ (1,29,500), బీజింగ్ (1,28,000), షాంఘై (1,27,200), సిడ్నీ (1,26,900) తొలి పది నగరాల జాబితాలో ఉన్నాయి. భారత్ నుంచి 59,400 మంది మిలియనీర్లతో ముంబయి 21వ స్థానం దక్కించుకొంది. తర్వాత దిల్లీ 30,200 మిలియనీర్లతో 36వ స్థానంలో, బెంగళూరు 12,600 మంది మిలియనీర్లతో 60వ స్థానంలో, కోల్‌కతా 12,100 మందితో 63వ స్థానంలో, హైదరాబాద్ 11,100 మందితో 65వ స్థానంలో ఉన్నాయి. ఆఫ్రికా, ఆస్ట్రేలియాసియా, సీఐఎస్, తూర్పు ఆసియా, ఐరోపా, మధ్యప్రాచ్యం, ఉత్తర అమెరికా, దక్షిణాసియా, ఆగ్నేయాసియా ఇలా వివిధ ప్రాంతాలుగా విభజించి హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ సంపన్న నగరాల జాబితాను రూపొందించింది. అమెరికా నుంచి అత్యధిక నగరాలు దీనిలో చోటు దక్కించుకున్నాయి. 2000లో ఈ జాబితాలో తొలిస్థానంలో ఉన్న లండన్ ఇప్పుడు నాలుగో స్థానానికి పడిపోవడం గమనార్హం.




# మహబూబాబాద్ జిల్లాలో కరోనా కలకలం...

మహబూబాబాద్: జిల్లాలో కరోణ కలకలం రేపుతోంది. గార్ల మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 14 మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులకు కరోనా పాజిటీవ్‌గా నిర్ణారణ అయింది. బాధితులను అక్కడే క్వారంటైన్ చేసి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు తొర్రూరు సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో 8 మంది విద్యార్థులకు కరోనా పాజిటీవ్‌గా నిర్ధారణ అయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కరోనా కేసులు రోజు రోజుకు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రధానంగా విద్యా సంస్థల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. మహబూబాబాద్ జిల్లా, గార్ల మండలంలోని ఓ ప్రైవేటు స్కూలు హాస్టల్‌లో కరోనా విజృంభించింది. హాస్టల్‌లో అస్వస్థతకు చెందిన ముగ్గురు విద్యార్థులను ప్రాథమిక చికిత్స కేంద్రానికి తీసుకువెళ్లగా.. అందులో ఇద్దరికి పాజిటీవ్ వచ్చింది. దీంతో హాస్టల్‌లో ఉన్న విద్యార్థులందరికీ పరీక్షలు చేయగా 14 మంది విద్యార్థులు, నలుగురు సిబ్బంది.. మొత్తం 18 మందికి కరోనా సోకినట్లు నిర్ధారణ అయింది. వారిని వెంటనే క్వారంటైన్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. మిగిలినవారికి కూడా పరీక్షలు నిర్వహిస్తున్నారు. మరోవైపు తొర్రూరులోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో అస్వస్తతకు గురైనా విద్యార్థులను ఆస్పత్రికి తరలించి పరీక్షలు చేయగా కొంతమందికి కరోనా పాజిటీవ్ వచ్చింది. మొత్తం స్కూల్లో ఉన్న 70 మంది విద్యార్థులకు పరీక్షలు చేయగా వారిలో 8 మంది విద్యార్థులు, ఒక టీచర్‌కు పాటిటీవ్‌గా నిర్ణారణ అయింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. మహబూబాబాద్ జిల్లాలోని వివిధ హాస్టళ్లలో కరోనా ఘంటికలు మోగుతున్నాయి. 15 రోజుల్లో నాలుగు హాస్టళ్లలో 45 మందికి కరోనా సోకింది. దీంతో పిల్లలు మానసికంగా బాధపడుతూ పరీక్షలు సరిగ్గా రాయలేకపోతున్నారు. వేసవి ఆరంభం ఏప్రిల్ నుంచే విద్యార్థులకు వార్షిక పరీక్షలు జరుగుతున్న క్రమంలో భౌతిక దూరం పాటించకుండ సామూహికంగా ఉండే హాస్టళ్లలోనే కరోనా పరీక్షలు పెడుతోంది. మూకుమ్మడిగా వాష్‌రూంలు, టాయిలెట్‌లు, కిచెన్‌లు కలిసి వాడడం, ఒక్కో గదిలోనే విద్యార్థులు కలిసిమెలిసి ఉండడం.. అపరిశుభ్రత వెరసి కరోనా వ్యాప్తికి కారణమని వైద్యా ఆరోగ్యశాఖ ఉద్యోగులు అనుమానిస్తున్నారు. హాస్టళ్లలో మాత్రం దగ్గు, జలుబు, జ్వరం లాంటి లక్షణాలు వెలుగులోకి రాగానే అప్రమత్తమై సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం ఇస్తున్నారు.

దీంతో వెంటనే అధికారులు అప్రమత్తం కావడం, ప్రత్యేక క్యాంపు నిర్వహించి కరోనా టెస్టుల ద్వారా పాజిటివ్ వచ్చిన వారికి ఐసో లేషన్ గదిలో ఉంచడం, ప్రత్యేక వైద్యం అందించడంతో పాటు స్థానిక మునిసిపల్, గ్రామపంచాయతీల ద్వారా ఆయా హాస్టళ్లలో బ్లీచింగ్ చల్లించి క్లాస్‌రూంలు, వాష్‌రూంలు, టాయిలెట్‌లు, శుభ్రం చేయడం, ఒకశాతం హైపోక్లోరైడ్ పిచికారి చేయడం లాంటివి చేపడుతూ.. కరోనా వ్యాప్తికి అడ్డుకట్ట వేస్తున్నారు.

# సీఎం కేసీఆర్‌కు షాకిచ్చిన మహారాష్ట్ర పోలీసులు



హైదరాబాద్: బీఆర్ఎస్‌కు మహారాష్ట్ర పోలీసులు షాకిచ్చారు. మహారాష్ట్రలో BRS సభకు పోలీసుల అనుమతి నిరాకరించారు. ఈనెల 24న అంఖాస్ మైదానంలో BRS సభకు సన్నాహాలు చేస్తున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేసినట్లు తెలిసింది. మరో ప్రదేశాన్ని ఎంచుకోవాలని ఔరంగాబాద్ పోలీసులు సూచించారు. దాంతో పోలీసుల తీరు పట్ల తెలంగాణ సీఎం కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో ప్రదేశంలో సభ నిర్వహణకు గులాబీ దళం సిద్ధమవుతుంది. కాగా బీఆర్ఎస్ ను విస్తరించాలనే కార్యాచరణలో భాగంగా మహారాష్ట్రను ఎంపిక చేసుకున్నారు. ఇప్పటికే మరాఠా గడ్డలో రెండు సభలు నిర్వహించారు. ఇక మూడో సభ కూడా నిర్వహించాలని తేదీలు ఖరారు చేసుకోగా మహారాష్ట్ర పోలీసులు షాకిచ్చారు. కేసీఆర్ నిర్వహించాల్సిన బహిరంగ సభకు అనుమతి నిరాకరించారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ ఛత్రపతి శంభాజీ నగర్ కొత్తపేరులో ఈనెల 24వ తేదీన బహిరంగ సభ నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారు. అక్కడి అంఖాస్ మైదానంలో సభకు ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి.

# భారాస నేతల అక్రమాలకు బంగారు గని బలైపోతోంది: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: కార్మికుల కష్టార్జితంతో కొనసాగుతున్న సింగరేణి సంస్థను భారాస సర్కార్ భక్షించేందుకు ప్రయత్నిస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి కుటుంబం, భారాస నేతల అక్రమాలకు తెలంగాణ బంగారు గని బలైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గు గనుల వేలంలో పాల్గొనలేని రాష్ట్ర ప్రభుత్వం.. సింగరేణి సొమ్మును విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పెట్టుబడులు పెడతామని చూస్తే కార్మికులు సహించబోరని కిషన్‌రెడ్డి హెచ్చరించారు. ఈమేరకు దిల్లీలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "తెలంగాణ ఉద్యమంలో సింగరేణిని సాధించు, రక్షించు అనే నినాదాన్ని కేసీఆర్ తీసుకున్నారు. కానీ, ఈరోజు భక్షించే విధానాన్ని అమలు చేస్తున్నారు. 2014లో రూ.3,500 కోట్ల బ్యాంకు బ్యాలెన్స్‌తో సింగరేణి కొనసాగేది. ప్రస్తుతం సింగరేణి చెల్లించాల్సిన బకాయిలు రూ.10వేల కోట్లు దాటింది. భారాస చేతకాని తనంతో సింగరేణి అప్పులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. సంస్థలో సీఎం కుటుంబం, భారాస నేతల జోక్యం విపరీతంగా పెరిగిపోయింది. తెలంగాణలో బొగ్గు గనుల వేలంలో రాష్ట్ర ప్రభుత్వం పాల్గొనట్లేదు. టెండర్లు కూడా వేయకుండా తమ బాధ్యతను విస్మరించారు" అని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

# అంబర్‌పేట అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి తలసాని సవాల్



హైదరాబాద్ : హైదరాబాద్‌లోని అంబర్‌పేట నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి మంత్రి తలసాని సవాలు విసిరారు. దమ్ముంటే వారం రోజుల్లో ఆలయం ఎదుట చర్చకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం బీఆర్ఎస్ అంబర్‌పేట డివిజన్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. 20 సంవత్సరాల నుంచి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్‌రెడ్డి అంబర్‌పేటకు చేసిందేమి లేదని ఆరోపించారు. చర్చకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. కులాలు, మతాలతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని బీజేపీ నాయకులపై మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కంటే గొప్ప హిందువు ఎవరు లేరని మరోసారి స్పష్టం చేశారు. యాదగిరిగుట్ట వంటి గొప్ప ఆలయ నిర్మాణం, ఆలయాల అభివృద్ధి, గొప్పగా పండుగలు నిర్వహించిన కేసీఆర్ కే దక్కుతుందని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో 24 గంటల కరెంట్, తాగునీటి సమస్యను పరిష్కరించారని వెల్లడించారు. ప్రజలు కూడా ఆలోచించాలని పని చేసే వారికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భవిష్యత్ కోసం సీఎం కేసీఆర్ నిరంతరం ఆలోచిస్తారని అన్నారు.



# పొంగులేటి పొంగులు బయటపెట్టిన సండ్ర!

ఖమ్మం జిల్లా రాజకీయాల్లో కింగ్ మేకర్ ను అంటూ కొద్దిరోజులుగా అన్ని పార్టీలతో బేరం ఆడుతూ హల్ చల్ చేస్తున్నాడు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అని ఆ జిల్లాలో ఓ టాక్ నడుస్తోంది. ఈయన కోసం బీజేపీ కాంగ్రెస్ లు ఏకంగా మనుషులను పంపి చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండడంతో కొండెక్కి కూర్చుంటున్న ప్రచారం సాగుతోంది. బీఆర్ఎస్ ను కాలదన్ని వైఎస్ షర్మిలకు హ్యాండ్ ఇచ్చి ఏ పార్టీలో చేరుతాడో చెప్పకుండా సీట్ల కోసం బేరమాడుతున్న పొంగులేటి తీరుపై ఆ ఖమ్మం నేతలే అసహనం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ఖమ్మం జిల్లాలో గెలవనివ్వనని.. అసెంబ్లీలోకి ఆ పార్టీ ఎమ్మెల్యేలను వెళ్లనివ్వనంటూ శపథం చేసిన పొంగులేటిపై ఒక్కొక్కరూ బయటకొచ్చి మరీ బీఆర్ఎస్ నేతలు మాటల దాడి చేస్తున్నారు. నిన్న బీఆర్ఎస్ మంత్రి పువ్వాడ అజయ్ ఈ మంగమ్మ శపథాలు నడవవు.. పదికి పది స్థానాలు గెలుస్తామంటూ సవాల్ చేశారు. తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సైతం పొంగులేటి పొంగులు ఇక్కడ నడవవు అంటూ ఎద్దేవా చేశారు. పొంగులేటి వెంట తిరిగేవారు ఉదయం ఆయన వెంట ఉండి సాయంత్రం వేరే పార్టీ నేతలతో తిరుగుతున్నారని.. పొంగులేటి గుడ్డిగా నమ్మి భ్రమ పడుతున్నాడని సండ్ర వెంకటవీరయ్య సెటైర్లు వేశారు. పొంగులేటితో తిరిగి ప్రతి ఒక్కరూ తనవాళ్లు కాదని.. ఈ విషయం పొంగులేటి తెలుసుకోవాలంటూ చురకలంటించారు. పొంగులేటి తెలంగాణ ప్రజల కోసం చేసిన మంచి పని ఏంటి అంటూ సండ్ర నిలదీశారు. చౌకబారు విమర్శలు చేసే వారిని ప్రజలు విశ్వసించరని పొంగులేటికి స్పష్టం చేశారు. రాజకీయాల్లోకి రాకముందు పొంగులేటి చరిత్ర ఏమిటి? ఇప్పుడు పొంగులేటి పరిస్థితి ఏంటి అన్నది ప్రజలకు బాగాతెలుసు అని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఏ అభివృద్ధి చేయని పొంగులేటికి ప్రజలు ఎందుకు ఓటు వేస్తారంటూ సండ్ర ప్రశ్నించాడు. కేసీఆర్ ను టార్గెట్ చేస్తూ ఈ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న నిన్ను ప్రజలు గమనిస్తున్నారని సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. ఇక ఇదే సమయంలో విమర్శలే ధ్యేయంగా పనిచేస్తున్న వారిని అహంకారపూరితంగా మాట్లాడే వారిని ఓటేసి గెలిపిస్తారా? చెప్పాలని ప్రజలను ప్రశ్నించారు. పొంగులేటికి రాజకీయ విధానం తెలియదని ఎద్దేవా చేశారు. రెండు జాతీయ పార్టీలు పొంగులేటి వైపు చూడడం లేదని.. నువ్వే వాళ్ల వైపు చూస్తున్నావ్ అంటూ సండ్ర పేర్కొన్నాడు. ఇక ఆ పార్టీలు నీకు మద్దతు ఇస్తాయా? అనేది కూడా తెలియాల్సి ఉందని.. ఆ పార్టీల విధానాలు కూడా ప్రజలు గమనిస్తున్నారని సండ్ర చెప్పుకొచ్చారు. ఇన్నాళ్లు తనకే బలం ఉందని రెచ్చిపోతూ విమర్శలు చేస్తున్న పొంగులేటిపై ఇప్పుడు బీఆర్ఎస్ మాటల దాడి మొదలైంది. దీన్ని పొంగులేటి ఎలా కాచుకుంటాడన్నది వేచిచూడాలి.




# సూడాన్‌లో చిక్కుకున్న భారతీయులు

# మీరు ఆందోళన చెందడంలో బిజీగా ఉంటే..!

దిల్లీ: ఆఫ్రికా దేశం సూడాన్‌లో భద్రతా బలగాల మధ్య గత కొద్దిరోజులుగా తీవ్ర ఘర్షణలు జరుగుతున్నాయి. రాజధాని నగరం ఖార్తూమ్ దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ క్రమంలో ఉద్రిక్త ప్రాంతాల్లో 31 మంది కర్ణాటక వాసులు చిక్కుకుపోయారు. ఇప్పుడు ఈ అంశం విదేశాంగ మంత్రి ఎస్ జై శంకర్, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మధ్య ట్విటర్ వార్‌కు దారితీసింది. 'సూడాన్‌లో చిక్కుకున్న కన్నడిగులంతా హక్కీపిక్కీ గిరిజన తెగకు చెందినవారు. కొద్దిరోజులుగా తిండిలేక అలమటిస్తున్న వారిని ఆదుకోవాలి. వారిని వెనక్కి రప్పించే చర్యలను ప్రభుత్వం ఇంకా ప్రారంభించలేదు' అని ప్రధాని మోదీ, విదేశీ మంత్రిత్వ శాఖను ఉద్దేశించి సిద్ధరామయ్య ట్వీట్ చేశారు. దీనికి జై శంకర్ కాస్త ఘాటుగా బదులిచ్చారు. 'ఈ పరిస్థితిని రాజకీయం చేయడం పూర్తిగా బాధ్యతారాహిత్యం. మీ ట్వీట్ చూసి దిగ్భ్రాంతికి గురయ్యాను. వారి ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయి. ఈ సమయంలో రాజకీయాలు చేయకండి' అని విమర్శించారు. అలాగే భద్రతా కారణాల దృష్ట్యా అక్కడ చిక్కుకున్నవారి వివరాలు బయటపెట్టలేమన్నారు. ఈ విషయంపై అక్కడి దౌత్యకార్యాలయం మాకు ఎప్పటికప్పుడు వివరాలు అందజేస్తోందని తెలియజేశారు. అయితే కేంద్రమంత్రి ఇచ్చిన సమాధానంపై సిద్ధూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

'మీరు విదేశాంగ మంత్రి కావడం వల్ల సహాయం కోసం మీకు అభ్యర్థన చేశాను. మీరు ఆందోళన చెందడంలో బిజీగా ఉంటే.. మా ప్రజలను తిరిగి వెనక్కి రప్పించగలిగే తగిన వ్యక్తిని మాకు చూపించండి' అంటూ వ్యాఖ్యలు చేశారు. కర్ణాటక ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో తమ రాష్ట్ర వాసుల్ని సురక్షితంగా రప్పించే విషయంలో పార్టీలు పోటీ పడుతున్నట్లు కనిపిస్తోంది. ఇదిలా ఉంటే.. సూడాన్‌లో చిక్కుకున్న భారతీయుల భద్రత నిమిత్తం భారత్ పలు దేశాలతో సంప్రదింపులు జరుపుతోందని సమాచారం. అక్కడి పరిస్థితిపై యూకే, యూఎస్, సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాలతో చర్చిస్తోంది. క్షేత్రస్థాయిలో సహకారానికి యూఏఈ, సౌదీ అరేబియా హామీ ఇచ్చినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

# ప్రకృతిపై మానవ దాడి ఎంతమాత్రం సహేతుకం కాదు: మంత్రి జగదీశ్ రెడ్డి



సూర్యాపేట: ప్రకృతిపై మానవ దాడి ఎంత మాత్రం సహేతుకం కాదని విద్యుత్ శాఖామంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. తద్వారా మానవ మనుగడనే ప్రశ్నార్థకంగా మార్చారని చెప్పారు. భారతీయ విలువలే మానవ మనుగడను నిర్దేశిస్తాయని తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సత్యసాయి ధ్యానమండలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన యోగా శిక్షణా తరగతులను మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. భూమండలంలో అన్ని జీవులు ప్రకృతి పరిరక్షణకు తాపత్రయ పడుతున్నాయని, దానికివిరుద్ధంగా మానవుడు మాత్రం ప్రకృతిపై అన్ని వైపులా దాడులు చేసి తనకు తాను అంతరించే పరిస్థితులు ఉత్పన్నం చేసుకుఉన్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. పైగా సృష్టిలో ఏ జీవికి లేని అహం మనిషిని అవరించిందన్నారు. అన్నీ తమకే తెలుసంటూ అహంతో మానవుడు చివరఖారికి దారితప్పి ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. ఆత్మహత్యలు కూడ ఒక్క మానవ జీవితానికే ఆవరించడం బాధాకరమన్నారు. అటువంటి విపత్కర పరిస్థితుల నుంచి బయట పడేందుకు యోగా ఉపకరిస్తుందని మంత్రి జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. మానవుడు సంఘ జీవిలా కొనసాగితే ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోవొచ్చని వెల్లడించారు.

# మే 6న మహబూబ్‌నగర్‌లో ఐటీ టవర్ ప్రారంభోత్సవం : మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ : దివిటిపల్లిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఐటీ టవర్ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మే 6న ప్రారంభంకానుంది. ఈ మేరకు మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఐటీ టవర్ ప్రారంభోత్సవంపై టీఎస్ఐఐసీ అధికారులతో మహబూబ్‌నగర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఐటీ టవర్‌కి వెళ్లే దారిని ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా జాతీయ రహదారి వద్ద పెద్ద ముఖ ద్వారం నిర్మించాలని అధికారులకు సూచించారు. ఐటీ టవర్ నుంచి మహబూబ్‌నగర్ పట్టణానికి అధునాతన రోడ్లను నిర్మించాలని ఆదేశించారు. సమావేశంలో టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ డీ రవి, డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్యాంసుందర్ రెడ్డి, ప్రముఖ కన్సల్టెంట్ రాజ్ కుమార్, నిర్మాణ సంస్థ గుత్తేదారులు నరసింహ, రాజశేఖర్ రెడ్డి, అమర రాజా సంస్థ ప్రతినిధులు మసూద్, రవితేజ పాల్గొన్నారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com